# వక్రగతులు

పరిష్కరింపరాని జటిల సమస్య, సరిదిద్దరాని బ్రహ్మదేవుడి పొరబాటు, బాహ్య పరిస్థితుల ప్రభావం మానవుడిలో ఎంతటి విస్మయావహమైన మార్పు తీసుకురాగలదో లోకానికి తెలివిడి చేసే నిదర్శనం - మురారి!

మురారిని గురించి ఆలోచించకూడదనీ, తలపుల్ని అతడి పైకి ప్రసరించకుండా అరికట్టాలనీ నాలో నేను బాసచేసుకున్న తర్వాత నాలుగేళ్ళ వ్యవధిలో మురారిని మరచిపోవడం అంత సులభం కాదని మాత్రం గ్రహించగలిగాను. ఒకటి : తలకు ఏదైనా అఘాతం తగిలి నామతి అయినా పోవాలి. రెండు : ఇప్పుడున్న పాత ఉడుపును త్యజించి ఈ జీవాత్మ మరో క్రొత్త బొందిలోకైనా తరలిపోవాలి. అందాకా మురారిని గురించిన స్మృతులు మనో వీధిలో నుంచి మాసిపోవడం అసంభవం!

ఒకానొక పీడకల తాలూకు భయంకర స్మృతిలా దాదాపు ఏడెనిమిదేళ్ళ నుంచీ ఈ మురారి నన్ను వెన్నాడుతూనే వున్నాడు. అతడి పిడికిట నా జీవిత రహస్యం దాగి వుందని గాదు. అలాటి రహస్యాలేమున్నాయి గనుక! అతడి చేత మానవ రుధిరాన్ని ఆస్వాదింపచేయడానికి సిద్ధంగా కైజారొకటి తళతళ మెరిసిపోతోందనీ గాదు. నిజానికతడు నా వెంబడి పరుగెత్తి రావడమూ లేదు. కేవలం అతడిని గురించిన ఆలోచనలు, అతడికి సంబంధించిన జ్ఞాపకాలు! అవి ఈ మానవుడి మనసును ఎంతగా కల్లోలితం చేసివేశాయి? హృదయంలో ఎట్టి బడబాగ్నిని నిక్షేపించాయి? అయ్యో! ఈ మురారి ఎవడు? విమాత్న చికిత్సా విధానాలను నోరులేని కప్పలపైన, కుందేళ్ళపైన ప్రయోగించి వాటి ఫలితాలను తెలుసికోవడం ఆధునిక వైద్య విజ్ఞానంలో ఒక పద్ధతి. ఐతే సృష్టికర్త మానవత్వం పైన చేయబూనుకున్న అద్భుత మైన ప్రయోగానికి గురైన దౌర్భాగ్యుడా ఈ మురారి!

బయట ఎండ నిప్పులు చెరిగిపోసే వైశాఖ మాసపు మధ్యాహ్న వేళ. గాలి కదలాడని గదిలో కూర్చుని అర్థ నిమీలిత నేత్రాలతో ఓసారి మురారి జీవితాన్ని సమీక్షించుకుంటే అదంతా నాకొక నాటకంగా మాత్రమే భాసిస్తోంది. ఇటీవల నాటక రంగంలో ఎన్నో మార్పులొచ్చాయి. పాత్రల్ని సృష్టించి 'నువ్వు లోభివి', 'నువ్వు వేదాంతివి', 'నువ్వు ఆదర్శవాదివి' అంటూ వాటిని రంగంపైన ప్రవేశపెట్టి, ఆ తరువాత రచయిత నిర్లిప్తంగా, తటస్థుడుగా పరిణామాల్ని చూస్తూ వూరుకోడం ఆ మార్పుల్లో ఒకటి. రంగంపైన పాత్రల మధ్య సమస్య తనంతటదే ఉద్భవిస్తుంది; తనంత అదే పెరుగుతుంది. సమస్యా పరిష్కారంలో మాత్రం అవసరమైతే రచయిత కలుగజేసుకుంటాడు. జగన్నాటక సూత్రధారికి కూడా ఆ పద్ధతిపైన మరులు కలిగిందేమో! సంకల్ప మాత్రం చేత ఆయన తెర తొలగించేశాడు. నాటకం ప్రారంభమైంది. ఆ నాటకంలో మురారిది కీలక పాత్ర. మిగిలిన పాత్రలన్నీ గ్రహం చుట్టూ తిరిగే ఉపగ్రహాల్లా మురారి చుట్టూ పరిభ్రమిస్తాయి.

విషాదకరమైన విషయమేమిటంటే, మురారి నాటకంలో నేను ప్రేక్షకమాత్రుణ్ణి మాత్రమే కాను. అందులో నా పాత్రకూడా కొంత వుంది. అదంత చెప్పుకోదగ్గదిగా యితరులకు గోచరించక పోవచ్చు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుని లాభం లేదు గాని, నిజానికి నేనొకప్పుడు ఆ నాటకంలో ఒక మార్పును, ఒక మలుపును సాధించగలిగి ఉండేవాణ్ణి. ఐతే ఆ మార్పు గానీ, మలుపు గానీ మురారిలో మాత్రం గాదు. చలదూర్మికాసంక్షుభితమైన సాగరాన్ని చేతుల బలంతో సంతరింపగలిగినవాడెలాగైతే లేడో, అలాగే మురారిలో మార్పు సాధించగలవాడూ లోకంలో లేడు! అందుకే నా ఏడుపు మురారిని గురించి కాదు; రాధని గురించి.

రాధ! రాధ నా మనసుకొక బాధ. హృదయానికొక వ్యథ. మహోన్నత పర్వతశృంగం మీద నిశ్చలంగా నిలబడి వున్న దేవాలయాన్ని చూచినప్పుడు రాధ నాకు జ్ఞప్తికి వస్తుంది. వినీలాకాశానికి అడ్డంగా, గంభీర నిశీథ సమయంలో లక్షదివ్వెలతో వెలిగిపోతున్న గాలి గోపురాన్ని చూచినప్పుడు రాధ నా తలపుల్లో ఇల్లు కట్టుకుంటుంది. అంతే మరి! ఆమె నాకు కేవలం ఒక స్మృతి. అంతకంటే మరేమీ లేదు.

ఉదయం పదిగంటలప్పుడు నాలుగు రోడ్ల కూడలిలో మోపెడు పుస్తకాలను మోసుకెళ్తూ సాంబయ్య గనుక నాకు కనిపించి వుండకపోతే, ఇప్పుడీ కథను పునశ్చరణ చేసుకోవలసిన అవసరం కలిగి వుండేది కాదు. మార్గ మధ్యంలో సాంబయ్య తారసిల్లాడు. పలకరించాను. గడచిన నాలుగేళ్ళలో జరిగిన విశేషాలను ఏకరువు పెట్టసాగాడు. నిల్చున్నదా అప్పుడప్పుడే కరిగిపోతున్న తారు రోడ్డుమీద! చుట్టూరా వీస్తున్నదా వడగాలి. వింటున్నదా మురారి గాథ. ఆ గందర గోళంలో గమ్యస్థానమేదో మరచిపోయి యింటికి తిరిగి వచ్చేశాను.

మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా మళ్ళీ సాంబయ్య ఇంటి ముందర హాజరు! 'లోపలికి రా సాంబయ్యా' అంటుండగానే 'ఎందుకులే బాబూ! వెళ్ళాలి' అని చీటీ నా చేతిలో వుంచి వెనుతిరిగి రోడ్డు పైకి వెళ్ళిపోయాడు! తన ముప్ఫై ఏళ్ళ జీవితంలో మురారి మొదటిసారిగా నాకు వ్రాసిన ఉత్తరం. ఆతురతగా విప్పాను :

"సాయంత్రం నాలుగు గంటలకోసారి నువ్వు నా రూముకు రాగలవా? నేను మూడు నెలల నుంచీ వ్రాస్తున్న పుస్తకం ఒకటి ఆపాటికి పూర్తి కావచ్చు. దాన్ని నీకు చదివి వినిపించాలను కుంటున్నాను.''

ఇది మామూలు విషయం కాదు! మురారిని తప్పకుండా నాలుగు గంటలకు ఆ హోటలు గదిలో కలుసుకోవాలి. కాని అంతవరకూ ఏం చేయడం? ఆహారం కనిపించగానే గొలుసులు త్రెంపుకోడానికి ప్రయత్నించే జాగిలాలకు మల్లే, ఆలోచనలన్నీ మురారి పైకే పరుగిడుతుంటే నిద్రమాత్రం ఎలా వస్తుంది?

* * *

దూరదూరంగా వుండి మా పాండురంగం బాబాయి విజ్ఞతను సరిగ్గా అవగాహన చేసుకోలేని వాళ్ల దృష్టిలో, ఆయన అప్పుడప్పుడూ కొన్ని అర్థం పర్థం లేని పనులు చేస్తుంటాడు. కానీ ఆత్మీయుల్లో, సమీప బంధువర్గంలో ఆయన దూరదృష్టిని శంకించేవాళ్ళు చాలాతక్కువ. ఒకింత అతిశయోక్తిని సాయం తెచ్చుకోదలచుకుంటే, ఏరు ఏడామడల దూరంలో వుండగానే పంచ పైకెగగట్టే వాటం ఆయనది! అర్థ సముపార్జనకు మానవుడు జరామరణాలు లేనివాడిలా కృషి చేయాలన్న పూనిక ఆయన జీవిత బృహత్కథలో ఎక్కడ బడితే అక్కడే గోచరిస్తుంది. ఆయన చేపట్టిన న్యాయవాద వృత్తి అందుకు

బాగా తోడ్పడింది. కాని ధనార్జన కోసం ఆయన పెడత్రోవలు త్రొక్కినట్లు చెప్పడానికి మాత్రం నిదర్శనాలు లేవు. పాండురంగం బాబాయి లోకజ్ఞుడు. లోకం చేత వ్రేలెత్తి చూపించుకోకుండా బ్రతకడమెలాగో, ఆయనకు తెలిసినట్టు మరొకరికి తెలియదు.

అలాటి పాండురంగం బాబాయి రాధకు పుట్టినరోజు పండుగ జరుపబోతున్నాడని తెలిసినప్పుడు, నేనొక క్షణం పాటు ఆశ్చర్యంతో బిగుసుకపోయాను. రాధ పుట్టిన పదిహేనేళ్ళకు ఆమె పుట్టినరోజుకు ప్రాధాన్యత నివ్వడంలో బాబాయి వుద్దేశమేమిటి? రాధ పుట్టుకకు గూడా సార్థకృత వుందన్న విషయాన్ని ఆయన యింతకాలానికి పసిగట్టగలిగాడా? ఏమిటో, మొదట నాకంతా అగమ్యగోచరంగా వుండిపోయింది. ఏమైతే నాకెందుకు? రాధ పుట్టినరోజు పేరిట నా కొకపూట విందుభోజనం సమకూరింది. అదీ తోటలో, వెన్నెల్లో!

జరుగుతున్నది శరదృతువేమో, మల్లెపువ్వులాటి వెన్నెల స్పర్శకు పులకించిపోతున్న బాబాయి గారి పూలతోట ఆకాశ గంగలో తానమాడి అప్పుడే గట్టెక్కుతున్న దివ్య సుందరిలా సాక్షాత్కరించింది. చెట్ల క్రింద వెలుగు చీకట్ల ముగ్గుల్ని చూస్తూ కుర్చీలో కూర్చున్నాను! విందుకు వచ్చిన వాళ్ళందరూ పది పన్నెండు మందికన్నా ఎక్కువ లేరు. ఇంకా ఒకటి రెండు కుర్చీలు ఖాళీగానే వున్నాయి. పండుగంతా ఆమెదే అయినా రాధముఖంలో నేనాశించినంత ఉత్సాహోద్వేగాలు వుట్టిపడడం లేదు. ఎవరో గానీ చాలా శ్రద్ధ తీసుకుని ఆమెను అలంకరించినట్టున్నారు. ఆ అలంకరించిన వాళ్ళు అందమనేది బజారు నుంచి యింటికి దిగుమతి అయ్యే ముడిసరుకని భ్రమిస్తున్నారేమో నాకు తెలియదు. నువ్వు రోజా నీరు పెట్టు, పాదు దిద్దు, కొమ్మల్ని సొగసుగా కత్తిరించు. ఎన్ని సొబగులు చేసినా శుకపిక సైన్యంతో వసంతుడు తరలిరానిదే వనలక్ష్మికి శోభ లేదు. మూడేళ్ళ రాధను భుజాన కూర్చోబెట్టుకుని తోటలో పరుగులు దీసిన బాల్యక్రీడ నిన్న మొన్నటిదిగానే కన్పిస్తున్నా, ఆమె కప్పుడే పదిహేనేళ్ళు గడిచిపోయాయి. ఈ వయస్సులో ఆమెకు కృత్రిమాలంకారాలు అనవసరం!

నేనక్కడికి వెళ్ళేసరికి 'స్విచాన్' చేయని విద్యుద్దీపంలా వున్న ఆ సమావేశంలో కొంత సంచలనం కలిగిన మాట నిజమే! కాని ఖాళీగా వున్న కుర్చీలు ఎవరికోసమయితే వుద్దేశింపబడి వున్నాయో, వాళ్ళు వచ్చేదాకా ఆ దీపం వెలిగే సూచనలు కనిపించడం లేదు. 'ఏమిట్రా బాబూ, నువ్వూ ఆలస్యంగానే వచ్చావు?' అంటూ బాబాయి ఆహ్వానించాడు. 'మునుపటి మనిషా మరి, ఉద్యోగం చేస్తున్నాడు గదండీ!' అంది రాజేశ్వరి పిన్ని. 'నువ్వలా వెళ్ళవే అమ్మా, అన్నయ్య నిక్కడ కూచోనీ' అంటూ, రాధ లేచి నిల్చోబోయింది. 'ఎందుకులే రాధా! నేనిక్కడే కూచుంటాను. ఎంతసేపు – ఓ అరగంటసేపు తతంగమే కదా' అంటూ నేను దూరంగానే కూచున్నాను. రాజేశ్వరి పిన్ని చీరచెరగులో నుంచి వస్తున్న సెంటు వాసన లొకవైపున, బాబాయి చుట్ట తాలూకు పొగమబ్బు లొకవైపున, మధ్యలో వుక్కిరి బిక్కిరౌతూ బోనులో తగులుకున్న లేడిపిల్లలా రాధ అదే కుర్చీలో కూలబడిపోయింది.

బాబాయి ఒక పొగచుట్టను పూర్తిగా కాల్చి నుసి చేసిన తర్వాత మరేం చేయడానికీ పాలుపోక టేబిల్ పైకి వంగి పిన్నివైపు చూస్తూ "గంట ఏడున్నర కావస్తోంది గదూ! అతడింకా రాలేదే" అన్నాడు.

"వస్తాడు. ఈపాటికి వస్తుంటాడు" అని భర్తగారికి భరవసాయిచ్చి "ఒకవేళ ఆ అబ్బాయి మరచిపోయాడేమోనండి" అంటూ అంతలో నిరుత్సాహపడిపోయింది రాజేశ్వరి పిన్ని.

"ఆ రాబోతున్న దెవరో తెలుసుకోవచ్చా పిన్నీ!" కుతూహలంతో ప్రశ్నించాను.

"చెప్పవచ్చునా, కూడదా" అన్నట్లు పిన్ని బాబాయి ముఖంలోకి చూచింది. ఆమె అమాయకత్వానికి జాలిపడుతున్నట్లు బాబాయి ఓసారి మెల్లగా నవ్వి "తినబోతూ రుచులడగడమెందుకురా

బాబూ! అతడు రాబోతున్నాడుగా! చూద్దువుగానీ వుండు" అన్నాడు.

ఆ రాబోతున్న అతిథి పట్ల బాబాయి నాలో ఉత్కంఠ రగిలించాడని ఒప్పుకోక తప్పదు. చుట్టుపట్ల ఆకులు గలగలమన్నప్పుడు, కొమ్మలు రెపరెప లాడినప్పుడు ఆ అతిథి వచ్చేస్తున్నాడనే అనుకున్నాను. కాని అతడు రాలేదు. గంట ఎనిమిదయింది. మళ్ళీ పదిహేను నిమిషాలు గడిచిపోయాయి. పరధ్యానంలో వుండగా చేయి ఎప్పుడు జేబులోకి పోయిందో తెలియదు; ఎప్పుడు పైకి వచ్చిందో తెలియదు. తెలివి తెచ్చుకునేసరికి వ్రేళ్ళ మధ్య సిగరెట్టు నలిగిపోతోంది. బాబాయి నావైపు చూడ్డం లేదు గనుక సరిపోయింది. ఒకవేళ చూచి గూడా చూడనట్టు నటిస్తున్నాడేమో! మనిషి గుర్రమనీ, మనసు కళ్ళెమనీ ఎవరో గాని గొప్ప సత్యాన్ని సెలవిచ్చారు. ఈ కళ్ళెం రౌతు స్వాధీనంలో లేనప్పుడు గుర్రం ఎప్పుడో ఒకప్పుడు కొంపముంచి తీరుతుంది. జాగ్రత్త పడడం ఎందుకైనా మంచిది. పైకి లేచి మెల్లగా పది బారలు నడిచి రావిచెట్టు వెనుకవైపున భూమిలో నుంచి పైకి తేలిన వేరుపైన కూర్చుని సిగరెట్టు ముట్టించాను.

"అన్నయ్యా!"

ఉలికిపడి వెనుదిరిగి చూచాను. ఆమె రాధ. అదే చెట్టు క్రింద, యింట్లో నుంచి వినవస్తున్న రేడియో పాటకు అనుగుణంగా, చిన్ని పాదాల్లో మువ్వలు ఘల్లు ఘల్లు మంటుండగా వచ్చీరాని నృత్యమాడిన రాధగాదు! ఈమె పదిహేనేళ్ళ రాధ. గులాబీ పువ్వు వన్నె పావడా కట్టుకుంది. వినీల గగనం లాంటి దావిణీ వేసుకుంది. పాపటలో నుంచి వదులు పడి కురులు కొన్ని నుదుటిపైన వ్రేలాడుతున్నాయి. ఆ క్షణంలో ముగ్ధ మోహన సౌందర్య మంతా మా రాధ సొమ్మేననిపించింది. కానీ ఆ ముఖంలోని నిర్వేదం? ఆ నిర్వేదాన్ని ఎలా వర్ణించను?

"అదేమిటి రాధా! నువ్వూ యిలా వచ్చేశావ్" అన్నాను.

"నీకళ్ళకు కూడా నేను పెద్దదాన్నయిపోయానా అన్నయ్యా" అంటూ రాధ నాముందర నేలపైన కూర్చుంది.

"అదేమిటి రాధా! ఓరోజు నేనీ చెట్టుక్రింద నిన్ను పడవేసేశాను. జ్ఞాపకముందా? పిన్నితో చెబుతావేమోనని భయపడ్డాను. కాని నువ్వు చెప్పలేదు" అన్నాను.

"అవునులే అన్నయ్యా! నువ్వు నన్ను మోసేంత కాలం మోశావు. ఆరేడేళ్ళు వచ్చేసరికి మోయలేక క్రింద పడేశావు. ఆ తర్వాత యిటీవలదాకా మాట్లాడనైనా మాట్లాడేవాడివి. ఇప్పుడదీ కరువైపోయింది. అంతకంతకూ నువునాకు దూరమైపోతున్నావన్నయ్యా" అంది రాధ.

"అబ్బే, యిదంతా నీ ఊహాగానం రాధా! ఇది బ్రతుకు కదా! ఇంకా బాల్యంలో వున్నట్టే వుండాలంటే వీలవుతుందా చెప్పు" అన్నాను.

రాధ నాలుగైదు క్షణాల పాటు మౌనంగా వుండిపోయింది. నేలమీద వ్రేలితో గీతలు వేస్తూ తలదించుకునే "రెండు మూడు నెలల నుంచి యింట్లో క్రొత్తగా ఓ గోల ప్రారంభమైందన్నయ్యా! అతగాడెవరో నీకు తెలుసుననుకుంటాను" అంది.

సిగరెట్టు పీకను అవతలికి విసిరి "నువ్వూ 'అతగాడు' అంటూ సర్వనామమే ఉపయోగిస్తే నాకేం తెలుస్తుంది రాధా" అన్నాను.

"అతడి పేరు మురారి!" అంది రాధ.

"మనం యిప్పుడు వేచి వుండడం ఆ మురారికోసమేనా రాధా?"

"అవును. అతడి నాన్నగారో, తాతగారో నాన్నగారి దగ్గర క్లయింటట. ఆవూరికి ఈయన

ఒకటి రెండుసార్లు వెళ్ళి వచ్చారట. భూమీ పుట్రా, నగలూ నట్రా అంతా నాలుగైదు లక్షల ఆస్తట. వాళ్ళింట్లో ఒక పడి నిండుకూ ఉంగరాలే వున్నాయట!"

మా బాబాయి దూరదృష్టి ఎంతటి తీక్షణమైందో నాకప్పుడు మాత్రమే అర్థమయింది.

ఉన్నట్టుండి రాధ తలపైకెత్తి "నా పెళ్ళికిప్పుడేం తొందరన్నయ్యా! నువ్వు నాన్నగారితో చెప్పవూ" అంది.

"ఎందుకు రాధా! ఆడబిడ్డంటే అర్థమేమిటో తెలుసా? ఎక్కడ అనడానికి 'ఏడ' అని వున్నట్టే అక్కడ అనడానికి 'ఆడ' అని ఒక రూపాంతరం వుంది. ఆడబిడ్డ ఎన్నటికయినా 'ఆడ'బిడ్డే కానీ, 'ఈడ'బిడ్డ మాత్రం కాదు. అంటే ఏమిటి? ఆడబిడ్డ ఎరువు సొమ్మన్నమాట! మరి ఎరువు సొమ్ము బరువు చేటే కదా రాధా!"

రాధ శూన్యంగా నా కళ్ళల్లోకి చూచింది. లోకంలో కనీసం ఒక్క వ్యక్తి అయినా తన హృదయాన్ని అర్థం చేసుకోనందుకు ఆమెకు ఆశాభంగం కలిగి వుంటుంది. కానీ, ఈ క్షణాన, నా చూపుకూ, బుద్ధికీ అందుబాటులో లేని ఏ సుదూర సుందర సీమలోనో గ్రుమ్మరుతున్న రాధా! నేను నీ హృదయాన్ని అర్థం చేసుకోగలిగాను. తల్లినీ, తండ్రినీ, తోబుట్టువుల్నీ, పుట్టి పెరిగిన పరిసరాల్నీ వదలిపెట్టి దూరంగా వెళ్లిపోవడానికి అవసరమైన తెగువ యిప్పటికింకా నీలో ఉద్భవం కాలేదు. భర్త పరిష్వంగంలో స్త్రీకోసమై ప్రకృతి నిక్షేపించివున్న అనిర్వచనీయానందానుభూతుల్ని నువ్విప్పటికింకా కలగనలేదు."

ఇంతలో బాబాయి పిలుపు వినిపించింది. ఆ పిలుపులో అతిథుల రాకవల్ల కలిగే సంభ్రమం వ్యక్తం కాలేదు. ప్లీడరుగా బాబాయి ఓటమిని తేలిగ్గా తీసుకోవడానికి అలవాటు పడిన మనిషి. అతిథులు రానందువల్ల ఏర్పడిన మందకొడితనాన్ని మభ్యపెట్టడం కోసం ఆయన అక్కడున్న వాళ్ళనందరినీ తన మాటల వెల్లువలో ముంచేస్తున్నాడు.

"ముప్పైరెండులో కాబోలు, మొదటిసారిగా ఆవూరెళ్లాను. స్టేషనుకు పన్నెండు మైళ్ళ దూరంలో వుందావూరు. గవర్నరు కయినా సరే కట్టెబండి తప్పమరొక యానసౌకర్యం లేదు. మూడు వైపులా కొండలు. మరోవైపున పంట పొలాలు. మనం కాశ్మీరాన్ని గురించి కలలు గంటుంటాం. ఆ తరిగొండ ప్రాంతాన్ని ఒకసారి చూస్తే చాలు. కాశ్మీరం ఎలా వుంటుందో కొంచానికి కొంచెం ఊహించుకోవచ్చు."

బాబాయి ఓ క్షణం ఆగి తన కథ పట్ల అందరూ సావధానంగా వున్నారని నిర్ధారించుకున్న తర్వాత మళ్ళీ ద్విగుణీకృతోత్సాహంతో ప్రారంభించాడు.

"ముక్కోణాకృతిగా వున్న కొండల కడ్డంగా వుంది వీరన్న చెరువు. చెరువు క్రింద ఒకటే ప్లాటు. మున్నూరెకరాలు. ప్లాటు ప్లాటంతా వెంకట శివయ్యగారిదే! ఇంకొకరికక్కడ ప్రవేశం లేదు." అని బాబాయి టేబిల్ చుట్టూ కూచున్న బంధువర్గాన్నొకసారి కలయజూచి, "వెంకట శివయ్యగారెవరో మీలో చాలామందికి తెలుసనుకుంటాను" అన్నాడు.

వెంకట శివయ్య గారిని గురించి తెలియకపోవడమేమిటి? ఆయన మామిడితోపుల ప్రశస్తిని గురించి బొంబాయి పళ్ళ మార్కెట్టులో అడగాలి. కలకండలా కంటికి కోరగించే తరిగొండ చెరకు బెల్లం నాణ్యాన్ని గురించి మదరాసు గిడ్డంగుల్లో విచారించాలి. ఆయన వ్యవహార కౌశలాన్ని గురించి తెలుసుకోవాలంటే హైకోర్టు వకీళ్ళతో సంప్రదించాలి. కాని యిప్పుడు బాబాయి వెంకట శివయ్య గారిని గురించి ఎందుకు చెబుతున్నట్టు?

బాబాయి కథ వేదాంతంలో పడ్డట్టుంది. "నిరుపేదలకు కుక్కమురికి సంతానం. కోటీశునాలికి

గొడ్డరికం. విధితలలో వున్న విచిత్రమే ఇది! వెంకట శివయ్య గారికి బిడ్డల్లేరు."

సమావేశంలో ఓ మూలగా కూర్చుని కునికిపాట్లు పడుతున్న వృద్ధుడొకతను - ఆయన రాజేశ్వరి పిన్ని వైపున దగ్గరి చుట్టం - "అయ్యో పాపం, ఆ శివయ్యగారు కాస్తా దాటుకుంటే ఆస్తి గతేం కావాలి?" అంటూ పరితాపాన్ని వెలిబుచ్చాడు.

"ఆ దాటుకోడమేదో రెండేళ్ళకుముందే జరిగి పోయింది మామయ్యా! వెంకట శివయ్య గారు ప్రస్తుతం కైలాస వాసులు" అన్నాడు బాబాయి.

"ఐతే ఆస్తి?" ఉత్తపుణ్యానికి బెంగ పడిపోతూ ఎవరో ప్రశ్నించారు.

"ఆస్తికేముంది? అది నిక్షేపంగా ఆయన దత్తపుత్రుడికి సంక్రమించింది."

"ఎవరు బాబాయ్, ఆ అదృష్టవంతుడు?" ఈసారి నేనే అడిగాను.

"అతడే మురారి" అన్నాడు బాబాయి.

ఒకానొక గొప్ప నవలలో సుదీర్ఘమైన మొదటి ప్రకరణం చదివి ముగించినంత 'రిలీఫ్' కలిగింది నామట్టుకు నాకు!

తొమ్మిది గంటల తర్వాత, అభ్యాగతుణ్ణి మనసు వచ్చీ రాక ఆదరించే గృహిణిలా విందుభోజనం టైబిల్ పైకి వచ్చింది. భోజనంతో పాటు అనుపానంగా బాబాయి మురారిని గురించి చెప్పుకపోతున్నాడు. వెంకట శివయ్య గారు దత్తత చేసుకునేనాటికి మురారి నాలుగేళ్ళవాడట. మురారికి తల్లితండ్రులున్నారు. మురారి మోచేతి గంజి కోసం ఆశించుకుని వున్న వాళ్లందరిలోనూ ఆ తల్లితండ్రులు ముఖ్యులు అని చమత్కరించాడు బాబాయి.

"పోనివ్వండి నాన్నా! ఎంతసేపని చెబుతారు" ఇంతసేపటికి రాధ కూడా కలుగచేసుకుంది.

"లేదంటే మురారి ఆస్తిపాస్తుల సంరక్షణ కోసం వెంకట శివయ్యగారు నియమించిపోయిన ధర్మకర్తలు ముగ్గురిలోనూ ఆ నరసింహం ఒకడు. రెండోవాణ్ణినేను. మూడోవాడు సాంబయ్య" అంటూ బాబాయి కథను ఒక కొలిక్కి తెచ్చేశాడు.

ఆ సాంబయ్య ఎవరో! ప్రశ్న పెదవి చివరిదాకా వచ్చింది.

కాని అడగడానికి ధైర్యం చాలలేదు. ఆ రాత్రంతా జాగరణ తోనే కాలం గడపడం నా అభిమతం కాదు.

ఐనా ఆ రాత్రి బాబాయి దగ్గర సెలవు తీసుకోడానికి ముందుగా సంశయ నివృత్తి కోసం మరొక ప్రశ్న అడగకుండా వుండలేకపోయాను.

"ఐతే ఈరోజు మురారి రాకపోవడానికి కారణమేమై వుంటుంది బాబాయ్? రైలు తప్పిపోయి వుండదు గదూ!"

"రైలు తప్పిపోవడమేమిటి? అతగాడిప్పుడు ఈవూళ్ళోనే వున్నాడురా బాబూ! కాలేజీలో చదువుకుంటున్నాడు. ఇది మొదటి సంవత్సరం. నాలుగు రోజుల క్రిందట తప్పక రావలసిందని హెచ్చరించి వచ్చాను కూడా! వాడికి మతిమరుపెక్కువలే! మరచిపోయి వుంటాడు" అన్నాడు బాబాయి.

అజీర్ణరోగికి లభ్యమైన మధురాహారంలా రాత్రి గడవనూ గడవనూ వెన్నెల మరీ అర్ద్రమైపోయి ముఖం మొత్తుతోంది. తలకు రుమాలుచుట్టుకుని చల్లటి రోడ్డుపైన తూలుతూ తూలుతూ యిల్లు చేరుకునేసరికి రాత్రి మలిజాము కూడా పూర్తి కావొచ్చింది. పడకపైన పడుకోబోతుండగా ఓ చిత్రమైన ఆలోచన స్ఫురించింది. బాబాయి కుటుంబంలో ఆ యింటిలో అడుగైనా పెట్టి ఎరుగని మురారి యెంత సంచలనాన్ని కలిగించ గలిగాడు? ఆకాశాన యెక్కడో గ్రహాలు మానవుడి జీవితంలో

ఫలాఫలాలు నిర్ణయిస్తాయని జ్యోతిష శాస్త్రజ్ఞులు చెబుతారు. ఈ మురారి గూడా మా బాబాయి పాలిటికి ఓ గ్రహమై కూచున్నాడు. కాని యిది దుష్టగ్రహమో, శుభగ్రహమో యిప్పుడప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదు. ఐనా ఒక విషయం మాత్రం తథ్యం. జామాతను దశమగ్రహమన్నారు. ఏతద్గ్రహ వీక్షణమాత్రం చేత కుటుంబంలో కొంత అలజడి కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు.

★ ★ ★

బాబాయిగారి పూలతోటలో విందు జరిగిన తరువాత ఆరునెలలకు గానీ మురారిని కలుసుకోడం తటస్థించలేదు. ఆ లోపల మురారిని గురించి ఓ విచిత్ర వృత్తాంతం మాత్రం వినగలిగాను. అతడిప్పుడు కాలేజీలో చదువుకోడం లేదు. ఓ రాత్రికి రాత్రే గది ఎలా వుందో అలాగే వదలిపెట్టి అతడు వూరికి వెళ్ళిపోయాడు. తదనంతరం పది రోజులకు సాంబయ్య వచ్చి కాలేజీకి, హాస్టలుకూ చేరవలసిన డబ్బు ముట్టజెప్పి పరుపూ, ట్రంకూ ఎత్తించుకుని వెళ్ళాడు.

ఈ వార్తను మొదట నా చెవికి చేరవేసింది రాధ. "కారణ మేమై వుంటుంది రాధా?" అంటూ విస్తుపోయాను. "ఏముంటుందిలే అన్నయ్యా! ఆ లెక్చరర్లు చెప్పేదేమిటో అతడి బుర్రకెక్కి వుండదు" అంది రాధ.

కాని బాబాయి వేరొక కారణం చెప్పాడు.

"వాడిందాకా చదివిందే చాలు. ఇంకా చదివి వాడా చదువుల్ని ఏం చేసుకోను! పరీక్షలు వ్రాసి పట్టాలు సంపాదించి ఉద్యోగం చేయవలసిన గ్రహచారం వాడికేముంది గనుక!" అని బాబాయి మురారి సంవత్సరాదాయం మూల కలెక్టరు జీతం రాళ్ళు ఏపాటివో నాకు విడమరచి చెప్పడానికి ప్రయత్నించాడు.

రాజేశ్వరి పిన్ని మాత్రం తక్కువ తిన్నదేమిటి? ఆమె కూడా తన వివేకం ప్రసరించినంత మేరలో మురారి పలాయనానికి ఓ కారణం ఊహించగలిగింది. "పంట కళ్ళంలో పావురంలా కాస్త కమ్మటి భోజనానికి అలవాటు పడిన కుర్రాడు. అతడికీ హాస్టలు సాంబారు మెతుకులేం రుచిస్తాయి పాపం!" జాలిగా అంది రాజేశ్వరి పిన్ని.

కాని ఏనుగున్ను గురించిన గ్రుడ్డివాళ్ళ అంచనాలను అంత గ్రుడ్డిగానే విశ్వసించడానికి నాకు మనస్కరించలేదు. విశ్వసనీయ వర్గాల్లో వాకబు చేయగా అసలు కారణమేమిటో రూఢిగా తెలిసింది.

ఉన్నట్టుండి ఎవరైనా చెబితే ఈ కారణం నమ్మడానికి వీలుగా లేని మాట మాత్రం వాస్తవమే! కాని యిది యథార్థం. మురారి హాస్టల్లో నుంచి పారిపోవడానికి కారణం దయ్యాలు!

ఈ దయ్యాలు మురారిని ఎంతగా వేపుక తిన్నాయో తెలుస్తే, ఆ తరువాత ఎవరైనా సరే మురారి హాస్టల్లోనుంచి పారిపోయినందుకు సానుభూతి ప్రకటించక తప్పదు.

కట్టడాలను మినహాయించి చూస్తే మురారి చదువుకున్న కాలేజీ ఓ కీకారణ్యంలా కనిపిస్తుంది. దయ్యాల చరిత్ర తెలిసిన విజ్ఞులు అది పిశాచావాసానికి అన్ని హంగులూ కలిగివున్న ప్రదేశమేనని యిట్టే పసికట్టగలరు! ఐనా కాలేజీలో చేరిన ఐదారు నెలల వరకూ మురారి దయ్యాల పోరు లేకుండా హాయిగానే కాలం వెళ్ళబుచ్చేశాడట. ఇంతలో ఎలా తెలిసిందో గాని హాస్టల్లో విద్యార్థుల కందరికీ మురారికి దయ్యాల మనుగడ పట్ల అచంచల విశ్వాసం వున్నట్టు తెలిసిపోయింది. బుద్ధి పుట్టాలే గానీ కాలేజీ కుర్రాళ్ళు కామరూపులు. వాళ్ళకు మురారిని ఏడిపించాలని బుద్ధి పుట్టింది. ఓ దయ్యం మురారి నిద్రలేచేసరికి తలుపుకు బయట గొళ్ళెం వేసేసింది! మరో దయ్యానికి రాత్రిపూట కిటికీ గుండా మురారి పరుపు మీద నాలుగైదు గులకరాళ్ళు విసరడం ఓ రివాజై పోయింది. ఇంకొక దయ్యం

- బహుశా కామినీ పిశాచం కాబోలు - అర్ధరాత్రి వేళ మురారి గది ఎదుట వరండాలో తారట్లాడుతూ విరహ గీతికలు పాడింది. మురారి భయపడిపోయాడు. లోలోపలే కుమిలిపోసాగాడు. దయ్యాలు మరీ పెచ్చురేగిపోయాయి. రాత్రి పదిగంటలయ్యీ కాకముందే అవి మురారికి గవాక్షంగుండా యింతలో ముఖం చూపించి, అంతలో చెట్ల మరుగున మటుమాయం కాసాగాయి!

ఈ విషయాన్ని రాధకు చెప్పదలచుకున్నాను. కాని యిందువల్ల ఆ లేత ఎదలో కొంత ఆందోళన రగులు కొల్పడం కన్నా ప్రయోజన మేముంది? బాబాయితో గానీ, పిన్నితో గానీ చెప్పవచ్చు. కాని తీరా ఈ పిశాచోదంతాన్ని బయటపెడితే బాబాయి యిదొక కట్టుకథ అని నవ్వేసినా నవ్వేయవచ్చు. రాజేశ్వరి పిన్ని మరికొంత దూరం పోయి నాసత్యాన్వేషణకు జ్ఞాతి మత్సర మన్న బురఖా తగిలించినా తగిలించవచ్చు. అనువుగాని చోట మౌనం కన్నా మించిన శరణ్యం మరొకటి లేదు!

వసంతం చివరి రోజుల్లోనో, గ్రీష్మ ఋతువు ప్రారంభంలోనో జ్ఞాపకం లేదు. నన్ను తోడిచ్చి బాబాయి పిన్నిని తరిగొండకు ప్రయాణం చేశాడు. అంతకు మునుపు వారం రోజులప్పుడు నరసింహం సతీసమేతంగా వచ్చి అమ్మాయిని చూచిపోవడం జరిగింది. ఇక పిన్నికి పెళ్ళికుమారుడునచ్చడమొక్కటే తరువాయి. పాండురంగం బాబాయి మూడు రోజుల పాటు బంధులోకాన్ని సుష్టుగా మేపి, అట్టహాసం పట్టపగలుగా పెళ్ళి జరిపెయ్యడానికి సిద్దంగా వున్నాడు.

సూర్యోదయం కాక మునుపే బయలుదేరినప్పటికీ, సాయంత్రం నాలుగు గంటలకుగానీ ఆ వూరు చేరుకోలేకపోయాము. అర్రువాచిపోయిన ఎద్దులు చందన పరాగంలాంటి ఎర్రటి దుమ్మును గిట్టలతో ఎగజిమ్ముకుంటూ బండిని లాక్కుపోతుండగా తరిగొండ ప్రకృతి దృశ్యాలు తెరలుతెరలుగా వెనకబడసాగాయి. చూచినంత మేరకు చిట్టడవి, అడవికి సరిహద్దు గీతలా నిలిచివున్న కొండలు, మధ్య మధ్యలో బాట కడ్డంగా పాయలు పాయలుగా పారుతున్న కొండ వూట నీళ్ళు, తెల్లగా పుల్లగా దుస్తులు తొడుక్కున్న నేరానికి మమ్మల్ని విప్పారిన నయనాలతో వింతగాచూస్తూ నిలిచిపోయే పాటక జనం - ఎంత సేపయినా యివే దృశ్యాలు వివిధ రీతుల్లో కన్పించాయి. బాబాయి తరిగొండ ప్రాంతాన్ని చూచి కాశ్మీరాన్ని ఊహించుకోమన్నాడు. కాశ్మీరు ప్రకృతి రమణీయత ఒక చోట కామించరాని దివ్యాంగన యొక్క శరీర లావణ్యంతో ఉపమించ బడింది. మరి తరిగొండ ప్రాంతం అందంలో జబ్బుపడి లేచిన పన్నెండేళ్ళ అమ్మాయి శరీరసౌష్టవం లాంటిది. ఈ అందంలో ఆర్ద్రత లేదు!

బండి చెరువుకట్టపైన తాబేటి నడక నడుస్తుండగా మరవ కావల మర్రిచెట్టు ఊడల సందుల్లోనుంచి ఆ వూరి బాహ్యస్వరూపం నయనగోచరమైంది. చుట్టూరా రెండడుగుల గోడలపైన మట్టి గొట్టుకపోయిన పూరికప్పులతో ఈసురోమంటున్న వందలాది పాకలు, మధ్యలో నాలుగైదు పెంకుటిండ్లు, ఒక వారగా పదిగ్రామాల పాళెగాడి పాతదేవిడీలాంటి మేడ ఒకటీ - ఇవి తొలిచూపుకు కన్పించాయి. భారతదేశం పల్లెటూళ్ళ దేశం. కానీ ఏ పల్లెటూరూ నాకు తరిగొండలా కనిపించలేదు. అంచులు చిరిగి శిథిలమైపోతుండగా, మధ్య జరీ పువ్వుల్లో పోగులు జారిపోతుండగా, చిక్కని సరిగతో పమిటచెరగుమాత్రం పళపళలాడిపోతున్న సిల్కుచీర లాంటి దీ వూరు!

బండి సింహద్వారాన్ని దాటి, పశువుల కొట్టాల మధ్యలోనుంచి సరాసరి మేడముంగిటికే వెళ్ళి ఆగింది. అది రెండతస్తుల మేడ. బొత్తిగా కిటికీలులేవని చెప్పడానికి వీలులేదుగాని, పున్నవిగూడా గాలినీ, వెలుగునూ లోనికి పోనివ్వడంలేదు. లోపలి గదుల్లో మిట్ట మధ్యాహ్నాల్లో గూడా దీపం వెలిగించుకోవలసి వస్తే అందుకు ఆశ్చర్యపడవలసిన అవసరమేమీ వుండదు. అది హోల్‌సేల్ వ్యాపారం సరుకుల్ని నిలువచేసి వుంచుకోడానికైతే అద్భుతమైన కట్టడం. మానవ నివాసానికి అదెంతవరకూ

ఉపయుక్తమన్నది ఆరోగ్యశాస్త్రాన్ని కాస్త తికమకపెట్టే విషయం!

వరండాలో మిత్రులమధ్య కూర్చుని పేకాటలో నిమగ్నుడై వున్న నరసింహం కూర్చున్న చోటునుంచి కదలకుండానే మా రాకపట్ల పెద్ద గొంతుకతో అత్యంతానందాన్ని ప్రకటించాడు. ఎదుటివారి ఊఁ-ఆఁ లకైనా ఎదురుచూడకుండా ఏకధాటిగా కుశలప్రశ్నలు కురిపించిన రెండు నిమిషాల సేపట్లో అతడు రాజేశ్వరి పిన్నిని మూడుసార్లు అక్కయ్యా అనీ, రెండుసార్లు వదినా అనీ సంబోధించాడు. పిన్ని అతడికి అక్కయినా, వదినయినా అందువల్ల కొంప మునిగే దేమీలేదు. కాని పేకాటలో ఈ కంగారు కామయ్య గతి ఏమయ్యేటట్టు?

ఇంతలో సుడిగాలిలా వచ్చి విరుచుకపడింది సుందరమ్మత్త!

సుందరమ్మను నేను అత్త అని వ్యవహరించడం ఊరికే ఉబుసుపోకకు మాత్రం కాదు. నే నెవరో పిన్నినడిగి తెలుసుకున్న తర్వాత మే మక్కడున్న రెండు రోజులపాటు సుందరమ్మ నన్ను సాక్షాత్తు అల్లుడి క్రిందే జమకట్టింది. ఆ సున్నితమైన పరిహాసాలు, కనిపించినప్పుడల్లా లేచినిల్చుని చెరగు సవరించుకుంటూ ముఖంలోకి సిగ్గునూ, పెదవుల పైకి మందహాసాన్నీ తెచ్చుకోవడంలో గల తీరుతెన్నులూ - వాటిని చూస్తుంటే ఏ యువకుడయినా సుందరమ్మత్తకు అల్లుడయ్యే అవకాశం కోసం అర్రులు చాచకమాన డనిపించింది. కాని యిందులోవున్న చిక్కల్లా ఒక్కటే! సుందరమ్మత్తకు ఒక్కగా నొక్క కూతురు మాత్రమే వుంది. ఆమెకు పెళ్ళయి నాలుగేళ్ళయింది. అప్పటినుంచీ అల్లుడు యింట్లోనే వుంటున్నాడు. అతడు విడి సమయాల్లో అల్లుడుగానూ, కలహాలూ అవీ వచ్చినప్పుడు మల్లుడుగానూ ఆ యింటికి వుపకరిస్తాడని ఆ తర్వాత తెలిసింది.

భార్య వరండాలో అడుగుపెట్టిన మరుక్షణంలో నరసింహం పరామర్శల తుపాను హఠాత్తుగా ఆగిపోయింది. భర్తగారి సాన్నిధ్యంలో జంకుగొంకులు లేకుండా నిర్భయంగా మాట్లాడి సుందరమ్మత్త తనకా యింట్లో వున్న స్థానాన్ని మాకు వ్యక్తం చేయదలచుకున్నదేమో, నాకు తెలియదు. కాని ఆమె మమ్మల్ని పదినిమిషాలవరకూ అక్కడే నిలవేసినమాట మాత్రం నిజం! ఆ పిమ్మట మేము ఏభై, అరవైమైళ్ళు ప్రయాణం చేసి వస్తున్నామన్న సంగతి ఆమెకు మెరపులా తట్టిందేమో, 'ఒరే రాముడూ! ఒసే రంగీ! పాలూ, పండ్లూ, చాపా' అంటూ గృహాంతర్భాగానికి వెళ్ళిపోయింది.

రాజేశ్వరిపిన్ని సుమారుపాటి పట్టణంలో పుట్టి అంతకంటే పెద్దనగరంలో కాపురం చేస్తున్న గృహిణి. ఆమెకు పల్లెటూళ్లు కొత్త. వంచిన నడుము పైకెత్తకుండా ఆడవాళ్ళెలా కలుపు తీయగలుగుతున్నారు? కావలిలేని మిరపతోటలో దొంగలెందుకు కాయగూరల్ని తస్కరించడంలేదు? పల్లెటూళ్ళల్లో ఎనుబోతులకు కూడా ఈదడం నేర్పిస్తారా? - త్రోవపొడుగునా రాజేశ్వరిపిన్ని కిలాటి విడ్డూరాలే కన్పించాయి. అన్నింటికన్నా ఆ రెండతస్తుల మేడ పిన్ని పాలిటికి మయసభే అయింది. 'ఇది లైబ్రరీ ఏమో' అని ఆమె తలుపులు తెరచిన గదిలో బెల్లపు ముద్దలు కనిపించాయి. ఆమె ఉద్దేశ ప్రకారం అతిథులెవరైనా వస్తే వాళ్ళు కూచోదగిన గదిలో కత్తులూ, కొడవళ్ళూ, బానలూ, మోకులూ కనిపించాయి. ఎవడో ఒక తలమాసిన క్లయింటు తెచ్చి యింట్లో పడవేసిన రెండుమణుగుల చింతపండుతో, ఒక మూట వేరుశనగకాయలతో, బుట్టెడు మామిడిపళ్ళతో తృప్తిపడగలిగిన రాజేశ్వరిపిన్నికి ఆ యింట్లో ఒక గదినిండుకూ చింతపండే కనిపించింది. హాల్లో పైకప్పుదాకా పేర్చివున్న వేరుశనగ మూటలే వున్నాయి. మరొకచోట ఎన్నిరోజులు తిన్నా తరిగిపోనన్ని మాడిమి కాయలున్నాయి. ఇక యింటికి బయట ఏ కొట్టంలో చూచినా ఎద్దులూ, కోడెలూ, ఆవులూ, దూడలే! ఈ 'పాడిపంటల సమృద్ధి' అన్న డాక్యుమెంటరీ చిత్రాన్ని చూస్తూ రాజేశ్వరిపిన్ని ఒకవైపున వెరగుపడి పోతుండగా, మరోవైపు

లోపలనుంచీ సుందరమ్మత్త ఆమెపైకి పళ్ళేరాల నిండుకూ పళ్ళూ ఫలహారాలూ, పుట్టతేనే, తాటిముంజెలూ పంపించి వేస్తోంది.

నేను మాత్రం తినగలిగినంత తినిన తర్వాత ఆలోచనలో పడ్డాను. ఎంతసేపూ ఈ వార్తాచిత్రమే అయితే, యిక అసలు సినిమా ప్రారంభమయ్యేదెప్పుడు? పెద్దపెట్టున ప్రచారం జరిగి, కడకు విడుదలేగాని చిత్రంలా అయిపోతాడా ఏమిటి ఈ మురారి?

"ఎంతసేపని కూర్చుంటావు బాబూ? అలా మేడపైకి వెళ్ళరాదూ! అబ్బాయి కూడా అక్కడేవున్నాడు" సమయానికి తలుపుచాటు నుంచి సుందరమ్మత్త గొంతు వినిపించింది.

బయట సూర్యాస్తమయం అయిందో, లేదో తెలియడం లేదు. కాని ఆ మేడలోపల మాత్రం అర్ధరాత్రయినట్టయింది. గోడ తడవి చూచుకుంటూ మెల్లగా మెట్లెక్కసాగాను. సోపానపంక్తి ఒకచోట మలుపు తిరగడంతో ద్వారం ఒకటి గోచరించింది. ఆ ద్వారం హాల్లోకి తెరుచుకుంటోంది. ఆ హాలూ ఒక చీకటి గుయ్యారమే! ఓవైపున వరుసగా మూడు గదులున్నాయి. ఆ మూడింటిలోనూ ఒక్క గదిలో మాత్రం దీపం వెలుగుతున్నందుకు చిహ్నంగా వోరవాకిల్లోనుంచి సన్నసన్నగా ఒక్కింత కాంతి హాల్లోకి ప్రసరిస్తోంది. ఆ వాకిలికి చేరువగా ఓ కుర్చీలో మోకాళ్ళకు పెనవేసుకున్న చేతులపైన తలానించి ముద్దలా ముడుచుకపోయివున్న ఓ నిశ్చల మానవాకారం కనిపించింది.

రెండు నిమిషాలు వేచి చూచాను. ఆ ఆకారంలో కదలిక లేదు! మెల్లగా ఓ పాడిదగ్గు దగ్గాను. కుర్చీలో వున్న వ్యక్తి ఉలికిపడి "ఎవరూ?" అంటూ తల పైకెత్తాడు.

నేనెవడినో తెలియజెప్పుకున్న తర్వాత లాంఛనప్రాయంగా స్వాగతం కూడా లభ్యమైంది.

"రండి, కూర్చోండి!"

హాల్లో ప్రవేశించి ఓ మంచం పైన కూర్చున్నాను. కూర్చున్న అయిదు నిమిషాలకు కుర్చీలోని వ్యక్తి మళ్ళీ ఒకసారి నోరు తెరిచాడు :

"అరగంట సేపై వుంటుంది. చిన్న బాబుగారికో యింజక్షన్ చేసి పడుకోబెట్టాను. నిద్ర పట్టినట్టుంది. లేపమంటారా?"

"అబ్బే! ఎందుకులెండి??" అని అపవారించి "ఇంతకూ ఆ జబ్బేమిటో చెప్పారుకారు" అన్నాను.

ఇంతలో గదిలోనుంచి అస్పష్టంగా ఓ ధ్వని వినిపించింది. అస్పష్టత మూలంగా అది పిలుపో, లేక మూలుగో తెలుసుకోలేక పోయాను.

"లేచినట్లున్నారు. చూద్దురుగానీ రండి" అంటూ సాంబయ్య - అతడు సాంబయ్యేనని ఎలా వూహించగలిగానో చెప్పలేను - పైకి లేచాడు.

పాదాలు తడబడ్డాయి. గదిలో అడుగుపెడుతుండగా ఎందుకో గాని ఉన్నట్టుండి గుండె ఆగిపోయినట్టు ఫీలయ్యాను. తీరా గదిలో ప్రవేశించిన తర్వాత నా కళ్ళకో కొత్తలోకం ప్రత్యక్షమయింది.

ఆ లోకంలో అయిదు బీరువాలు, ఒక పట్టెమంచం, నాలుగైదు కుర్చీలు, యింత మాత్రమున్నాయి. అవి చూర్ణాలు గావు. అవి గుళికలు కావు. అవి తైలాలుగావు - రెండు బీరువాలను ఖాళీ లేకుండా ఆక్రమించుకుని వున్న ఆ ఔషధాలు మానవ జీవితం యొక్క క్షణభంగురత్వాన్ని గురించి మాటిమాటికీ హెచ్చరిస్తుండగా పాత పుస్తకాలతో నిండివున్న మిగిలిన బీరువాల క్రీనీడక్రింద మంచంపైన తలగడ కానుకొని ఓ యిరవయ్యేళ్ళ యువకుడు పై కప్పుకేసి చూస్తున్నాడు. అతడు పొడుగరి. అతడు రూపవంతుడు. అతడిది తీర్చిదిద్దిన అవయవసౌష్ఠవం. కాని అతడి ముఖంలో ఏదో భ్రమ, ఏదో భయం, ఏదో భావ సంఘర్షణ! అతడే మురారి!

మంచం ప్రక్కన నిల్చుని, రోగివైపు చూడ్కులు నిగిడిస్తూ "ఇప్పుడెలా వుంది బాబూ!" అని ప్రశ్నించాడు సాంబయ్య.

"నీరసంగా వుంది. గుండెపోటు తగ్గిందిగాని, వెన్నుపోటు బలమైనట్టుంది. ఇంతకుమునుపు ఈ చేతిని పైకెత్తాలంటే సాధ్యం కాలేదు" అన్నాడు మురారి.

సాంబయ్య చరచరా బీరువా దగ్గరికి వెళ్ళి నాలుగైదు చూర్ణాలు ఒకటిగా కలిపి తేనెతో రంగరించి "దీన్ని పుచ్చుకో బాబూ! తెల్లవారేసరికి అన్ని పోట్లూ కుదిరిపోతాయి" అన్నాడు.

మందు గొంతు వెంబడి జారుతుండగా ఎనిమిది వంకరలు తిరిగిపోయిన మురారి ముఖాన్ని చూస్తూ అప్రయత్నంగా నిట్టూర్చాను. మింగిన మందు మళ్ళీ పైకి రాకుండా కడుపులో కాస్త స్తిమితపడిన తర్వాత మురారి నావైపోసారి చిత్రంగా చూచి, యితడెవరో చెప్పలేదే అన్నట్లు సాంబయ్యకేసి ప్రశ్నార్థకంగా చూచాడు.

నాలుగైదు పొడిమాటలతో నన్ను మురారికి పరిచయం చేసి సాంబయ్య "నిల్చుండిపోయారేం బాబూ! అలా కుర్చీలో కూచోండి" అన్నాడు.

కుర్చీని మంచం దగ్గరకు లాక్కుంటూ "సాంబయ్యగారూ! నే నొక మాట చెబుతాను. మరేమీ అనుకోరుగదా!" అన్నాను.

"చెప్పండి" అన్నాడు సాంబయ్య.

"ఏనదానికీ, కాని దానికీ మందులు పుచ్చుకోగూడదని పెద్ద పెద్ద డాక్టర్లే చెబుతారు. మందులూ, ఇంజక్షన్లే మనిషికి ఆరోగ్యం ప్రసాదిస్తా యనుకోవడం పొరబాటు. చల్లటి సాయంకాలం హాయిగా పైరు పచ్చలపైన తిరిగిరావడం మంచిది కదూ! అహఁ! మీకు తెలియదని కాదు. మాటవరుసకు చెబుతున్నాను" అన్నాను.

మురారి నా సలహాను వింటూ తెల్లబోయాడు.

"సంగతి సందర్భాలు తెలియని వాళ్ళ కలాగే తోస్తుంది." బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ చెప్పుకుపోసాగాడు సాంబయ్య. "దాయాదులు బాబూ, దాయాదులు! ఊరినిండా వాళ్ళే! పొరుగు పచ్చగా వుంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు. మీకు తెలియదు గాని ఒక్కొక్కరివి విషపు కళ్ళు! వాళ్ళ చూపు తగిలితే చాలు. మరునాటికల్లా మనిషికేదో ముంచుకొచ్చేస్తుందన్న మాటే! ఒకసారేమైందో తెలుసా? దిష్టి తగిలినట్టే తగిలి, ఆపైన జ్వరం వచ్చి చిన్నబాబు రెండునెలలు పడకపై నుంచి లేవలేకపోయాడు."

దృష్టిదోషం సంగతి దేవుడెరుగు! మురారి పడకపైనుంచి లేవకపోవడానికీ, ఆ గదిలోని బీరువాల్లో నెలకొని వున్న సిద్ధౌషధాలకూ యేదో సంబంధం వుండి వుంటుందని నా కనుమానం కలిగింది.

"వెంకటశివయ్యగారు మురారిని నాకప్పగించి పోయారు. ఎందుకు? మురారికి తండ్రి వున్నాడు. తల్లి వుంది. బంధువులున్నారు. కాని వెంకటశివయ్యగారు మురారిని నా కెందుకు అప్పగించారు?"

ఎందుకో మరి! ఇది తప్పకుండా ఆలోచించవలసిన విషయమే. నా మట్టుకు నాకు ఒక దివ్యమైన కారణం తోచింది. మానవుడన్న తర్వాత వాడి కెప్పుడో ఒకప్పుడు కించి దనారోగ్యం కలుగక మానదు. కాని ఆ అనారోగ్యంపైన పగబట్టి, అదెంతవరకూ విజృంభించగలదో పరీక్షించి, దాన్ని నిర్దాక్షిణ్యంగా చీల్చి చెండాడగల పట్టుదల ఈ లోకంలో సాంబయ్యకు తప్ప మరొకరికి లేదేమో!

"వెంకటశివయ్యగా రప్పుడప్పుడూ చెబుతుండేవారు. 'ఏమిటనుకున్నావో సాంబయ్యా! కాలం

బొత్తిగా చెడిపోయింది. భార్య భర్త మాట వినడం లేదు. బిడ్డ తల్లి మాట వినడం లేదు. చేతిలో రూకలుంటే లోకమంతా బంధువులే! అందరూ పయోముఖ విషకుంభాలు. గోముఖ వ్యాఘ్రాలు. మురారిని నీ కప్పగిస్తున్నాను. వాడికి తేనెపూసిన కత్తేదో, కన్నుబోయే కాటుకేదో తెలియదు. భద్రం, జాగ్రత్త' అన్నా రాయన. అంటూ కళ్ళు మూసుకుపోయారు. పోతేనేం! అడగండి. బుద్ధి తెలిసిన తర్వాత ఎక్కడైనా పచ్చి మంచినీళ్ళు ముట్టుకోనిచ్చానేమో మురారినే అడగండి."

హే భగవాన్! ఏమిటీ ఆంక్ష? ఆఖరుకు యీ మురారిని ఏం చేయదలుచుకున్నావు నువ్వు! అవసరంకంటే దశాధికంగా, శతాధికంగా ఒకే మానవుడికి భోగభాగ్యాలు ప్రసాదించి, అత్యవసరమైన గాలీ నీళ్ళ పట్ల గూడా వాడికి ఆంక్ష కల్పించడంలో నీ వుద్దేశమేమిటి?

కాదు. మళ్ళీ నేను పొరబడుతున్నాను. ఉచితానుచితాలను పాటించకుండా భగవంతుడికీ, మానవుడి బ్రతుక్కూ ముడిపెట్టడం పొరబాట్లలో పెద్ద పొరబాట్లు. 'ఉన్నాడు' అన్న అంబరచుంబిత మహాపర్వతాలకుపైన, 'లేడు' అనే పాతాళాన్నంటే అగాధాలకు ఆవలిగట్టున ఆ భగవంతుడు వుంటే గింటే ఆయన చేసిన పనల్లా ఒక్కటే! ఇంత ముడిపదార్థాన్ని సరఫరా చేశాడు. దానిలోనుంచి మురారిలాంటి మహత్తర శిల్పాన్ని మలిచిన నిర్మాణదక్షత సాంబయ్యది!

సందేహం లేదు. సాంబయ్య మహాశిల్పి!

ముంజేత గడియారం లేకపోవడంచేత ఆ గదిలో కూర్చున్న తర్వాత ఎంతకాలం గడిచిపోయిందో ఊహకు చిక్కలేదు. సాంబయ్య కలగాపులగంగా ఏవేవో పాత కథల్ని చెప్పుకుపోతున్నాడు. ఓసారి దగ్గరి బంధువులే వెంకటశివయ్యగారికి విషం పెట్టడానికి ప్రయత్నించడం, మరొకసారి జ్ఞాతులు శూన్యం పెట్టగా ఆయనకో కాలూ, చేయీ స్వాధీనం తప్పిపోవడం, అటుతర్వాత మహంకాళీ ఉపాసకుడైన మంత్రాల మల్లయ్యరాక, వెయ్యిన్నీ నూటపదహారు నిమ్మకాయలు, ఐదు నల్లమేకపోతులు, ఒకవీశ కర్పూరం వగైరా వగైరా....

అనంతమైన ఈ భయంకర గాథకు అంతరాయం కలిగింది మురారివల్ల! అతడున్నట్టుండి మంచంపైన లేచి కూచుని పై కప్పుకేసి చూస్తూ "అదిగో, అదిగో" అన్నాడు.

"ఏమిటీ, ఏమిటీ" కంగారుగా ప్రశ్నించాను.

నా ప్రశ్న సంగతి ఎవరూ పట్టించుకోలేదు. సాంబయ్య మాత్రం చెవి ఒగ్గి ఆలకించి ఓ నిమిషం తరువాత "అవును, అవును" అన్నాడు.

అదేం భాష! ఓయి భగవం.... కాదు కాదు. ఇక మానసబోధ కన్నా గత్యంతరంలేదు. ఓ మనసా! ఈ సాంకేతిక పరిభాషకు అర్థమేమిటి?

ఇంచుమించు అయిదు నిమిషాలసేపు ఆ గదిలో దుస్సహమైన మౌనమే మూర్తిభవించింది. ఆ తరువాత సాంబయ్య ఓ నిట్టూర్పు విడిచి "ఊఁ, ఎవరికి ప్రాప్తం వుందో!"అన్నాడు.

"ఏమండీ, సాంబయ్యగారూ! చంపకుండా, ఆ విషయమేమిటో చెప్పరాదుటండీ?" - ప్రాధేయపడ్డాను.

"మీకు వినిపించలేదా బాబూ అడుగుల చప్పుడు" సాంబయ్య విస్మయంగా ప్రశ్నించాడు.

"అడుగుల చప్పుడా! మేడపైన ఎవరైనా తిరుగుతున్నారేమిటి?"

"ఇదేం నిన్న మొన్నటి కథా? నేనీ యింట్లో గుమాస్తాగా చేరినప్పటినుంచీ వింటూనే వున్నాను."

ఎంత 'సస్పెన్స్' అయినా, దానికీ ఓ హద్దుండాలి. చిరాకుతో "పోనీలెండి సాంబయ్యగారూ!

అదేమిటో చెప్పకండి. నాకు తెలుసు కోవాలని లేదు" అనేశాను.

విసిగించీ విసిగించీ, ఆఖరుకు సాంబయ్య అసలు విషయాన్ని చాలా చప్పగా చెప్పేశాడు.

"దానికింకేంపని! సంజచీకటి పడగానే డాబాపైన పచారులు ప్రారంభం చేస్తుంది. మరేమీకాదు. ధనపిశాచంలెండి!"

"ఆరి నీతస్సాదియ్యా! సాంబయ్యా, నువ్వు మానవమాత్రుడివి కావు. ధనపిశాచాన్ని కూడా ఇంట్లో వున్న జనాభాలో అదీ ఒక వ్యక్తి గానే కలిపి లెక్కలు కట్టగలిగే స్తోమతు మానవమాత్రుడికి వుండదు."

ఇంటికి చుట్టుపట్ల ఎక్కడో భూమిలో నిక్షిప్తమైవున్న నిధిని గురించి చెప్పుకపోసాగాడు సాంబయ్య. మేడపైన తరచూ పచార్లు సలిపే ధనపిశాచం ఆ నిధికి కాపుదారిగా ఉద్దేశించబడిందట! (ఉద్దేశించినవాడు సాంబయ్యే అయివుంటాడని నా అనుమానం) ఆ నిధి ఎవరికి ప్రాప్తం వుందో వాడు అటువైపు ఒంటరిగా వెళ్ళినప్పుడు ఆ పిశాచం 'నన్ను తీసుకోవా, నన్ను తీసుకోవా' అంటుందిట. ప్రాప్తంలేనివాడు ఎలాగైనా కూపీతీసి నిధిని కాజేయదలిస్తే వాడు తక్షణం మండి మసైపోతడు. తప్పదు!

భోజనానికి రమ్మంటున్నారని పిలుపు రావడంతో నాకా గదిలో నుంచి విముక్తి లభ్యమైంది. పిలుపు తెచ్చినవాడు సుందరమ్మత్త అల్లుడు. కలుపుగోలుతనంలో అతడు అత్తగారికంటే ఏడాకులు ఎగచదివిన వాడిలా కనిపించాడు. అతడి పూర్తి పేరేమిటో నాకిప్పటికీ తెలియదు. సంగ్రహంగా అందరూ 'రాజా' అని పిలుస్తారు. నున్నగా, గుండ్రంగా చిన్నసైజు 'కింగ్‌కాంగ్' లాంటి మనిషి. ఎప్పుడో, ఏనాడో వదులు వదులుగా సిల్కుదుస్తులు వేసుకొని వీధిలో నడుస్తుండగా, ఏ భావుకుడోగానీ, 'అహో' అని ఓ 'ఎక్స్‌ప్రెషన్' యిచ్చి 'అడుగో మైనర్‌రాజా' అనేశాడట! అప్పటినుంచీ సుందరమ్మత్త అల్లుడు అతడి పరోక్షంలో బంధులోకంలోనూ, మిత్రవర్గంలోనూ ఆ బిరుదనామంతోనే వ్యవహృతుడు.

ఆరోజు రాత్రి నాతోబాటు భోజనానికి కూర్చున్నవాడు రాజు ఒక్కడే. సాంబయ్య రాత్రిపూట భోజనం మానేసి పదేళ్ళయిందనీ, అప్పటినుంచీ పాలూ, పళ్ళూ మాత్రం పుచ్చుకుంటున్నాడనీ తెలిసింది. మురారి ఔషదం సేవించాడు గనుక యిప్పుడప్పుడే భోజనానికి రాడని అతడి తరపున సాంబయ్యే ఓ మెమో జారీచేశాడు. సుందరమ్మత్త ఆకులు వేసి వంటగదిలోకి పోగానే నేను రాజుదగ్గరికి వంగి "మరి ఈపూట మామగారు గూడా భోజనానికి రారేమిటి?" అన్నాను.

"అంత మంచి ముఖానికి అర్ధశేరు కుంకుమా!" రాజు విరగబడి నవ్వేశాడు. ఆ నవ్వడం నవ్వడం సుందరమ్మత్త అన్నపు పళ్ళేరంతో తిరిగి వచ్చేంతవరకూ నవ్వి "విన్నావా అత్తయ్యా! మావయ్య అన్నానికి రాలేదేమని అడుగుతున్నాడు తమ్ముడు" అన్నాడు.

"ఆయనా! అప్పుడేవచ్చి భోంచేసి వెళ్ళారులే నాయనా!" అంది సుందరమ్మత్త.

"అంటే ఏమిటో తెలుసా తమ్ముడూ!" రాజు నా వీపుమీద ఢంకా మ్రోగించి చెప్పసాగాడు. "మావయ్య లోపలికి రావడంగానీ, బయటికి పోవడంగానీ అంత గుట్టుచప్పుడుగా జరిగిపోయే వ్యవహారమన్నమాట! నరసింహం మావయ్యలో నరాంశంకన్నా సింహాంశమే హెచ్చు. కాదనను. ఐతే? స్త్రీకి శక్తిస్వరూపిణి అన్న ప్రసిద్ధి వచ్చింది సుందరమ్మత్త మూలంగానే గదా! మరి ఆ ఆదిశక్తి వాహనమేమిటో నీకు తెలుసుననుకుంటాను. అంతే! శతాధిక గ్రంథభావమెల్ల తేటతెల్లంగా ఒక్కమాటలో తెలిపివేయడం మన అలవాటు."

"రాజు మాటలకేంలే నాయనా! ఇత డెప్పుడూ యింతే!" ముసిముసి నవ్వులు వెదజల్లుతూ అంది సుందరమ్మత్త.

"మనలో మనమాటరా తమ్ముడూ!" మొదటిసారి వేసిన అన్నం కన్నుమూసి తెరిచేలోపల ఖాళీచేసి మళ్ళీ మాటల్లోకి దిగాడు రాజు. "అవసరమొచ్చి అడిగితే పదో, యిరవయ్యో యివ్వదని నాకూ అత్తయ్యపైన కోపమే ననుకో. కాని ఆ కోపాన్ని అలా ప్రత్యేకంగా వుంచి ఆలోచిస్తే సుందరమ్మత్త అలా వుండడమే యెంతో బెటర్! లేకుంటే ఈపాటికి మావయ్య చేతికి దొరికిందల్లా పేకాటలో ధారబోసి యింటిని సర్వశూన్యంగా మిగిల్చి వుండేవాడు."

"బుద్ధిమంతుడిలా మాట్లాడుతున్నాడు గాని ఈయన గూడా అమామగారికి తగిన అల్లుడేలే బాబూ?" అంది రెండోసారి అన్నం వడ్డిస్తూ సుందరమ్మత్త.

భోజనమైన తర్వాత రాజు యింటిముందర ఆరుబయట మంచాలు వేయించాడు. వద్దు వద్దన్నా నిర్బంధంగా తాంబూలం నమలమన్నాడు. తాంబూలంవేయని వాడి బ్రతుకు వృథా అంటూ, అందుకు ఊతగా సుమతీశతకం నుంచి ఓ పద్యం వుదాహరించాడు. ఎంతసేపయినా అతడినే మాట్లాడనిచ్చి నేను మౌనంగా వింటూ వూరుకోడం నామోషీ అనిపించి "ఐతే, ఏం రాజూ! చూడబోతే బోలెడంత ఆస్తి. దీనిలో నీకు తృణమో, పణమో కలిసొచ్చే ఏర్పాటుందా లేదా" అన్నాను.

"నాకా! కలిసొచ్చే ఏర్పాటా! మామగారి వాటం చెప్పానా! ఇక అత్తయ్య వుంది. ఆమెగారికి మురారిగాక యింకా నలుగురు మగబిడ్డలున్నారు. సాంబయ్య బ్రతికివుండగా మురారి ఆస్తిలో ఒక్క సెంటు నేలగానీ, ఒక్కపైసా డబ్బుగానీ వాళ్ళకు సంక్రమించదు. ఐతే వాళ్ళ గతేం కావాలి? అత్తయ్యకు స్వంత భోషాణం వుంది. ఈ రోజు గానుగాడి బెల్లం యింటికివస్తే మరునాటికి పదిమూటలు కనిపించవు. గరిసె అలా వుండగానే లోపల వడ్లు మటుమాయమై పోతాయి. ఈ కరి మ్రింగిన వెలగపండులో మనకు దక్కబోయే దే ముంటుంది? దంచినందుకు బొక్కిందే ప్రాప్తి!"

రాజు అల్పసంతోషి! అతడిలో దుర్గుణాలు ఏవైనా వుంటే వుండనీగాక! వాటి నన్నింటినీ త్రోసిరాజనగల నిష్కాపట్యం అతడి సొత్తు!

పడుకున్న తర్వాత అతడున్నట్టుండి అడిగాడు:

"ఏమిట్రా తమ్ముడూ! మధ్యాహ్నమనగా వచ్చావే! 'ఒరే అన్నయ్యా? ఈ యింట్లో నీ పెళ్ళామంటూ ఒక మనిషివుండాలి గదా! ఆవిడ కనిపించలేదే! ఏమైం'దని అడిగావా?"

నిజమే! పొరబాటే! దాన్నెలా సవరించుకోవాలో నాకు చటుక్కున స్ఫురించలేదు.

"పోనీలే! నువ్వడగలేదని నేను చెప్పడం మానేస్తానేమిటి? ఆవిడ ఏడుకొండల వాడి సేవలో నిమగ్నురాలై వుంది. విడవకుండా ఓ మండలంపాటు సేవిస్తే సంతానప్రాప్తి ఖాయమని ఎవరో చెప్పారట! 'కొండలా ప్రాణేశుడుండగా యింటిలో, కొండపై దేవుని కొలుచుటేల?' ఏల అంటే? ఎవరి పిచ్చి వాళ్ళ కానందం!"

ప్రేమనుగురించి నాటకాల్లోనూ, సినిమాల్లోనూ విని దాన్ని గురించిన పుస్తక విజ్ఞానాన్ని కొంత ఒంటబట్టించుకున్నవాణ్ణి కావడం వల్ల పడుకోబోతూ భార్యను తలచుకుంటున్నాడు గనుక, రాజు అర్థరాత్రి వరకూ నిద్రపట్టక ఆపసోపాలు పడుతాడేమో ననుకున్నాను. వెన్నెల కాస్తోంది గనుక అది చంద్రోపాలంభనకు కూడా చక్కటి వేళ! కాని నా ఊహ లన్నింటికీ వ్యతిరేకంగా మాట్లాడుతూ మాట్లాడుతూ వుండగానే రాజుకు నిద్రపట్టింది. కొంతసేపటికి అతడు గురక పెట్టడం విన్నాను.

ఉదయం యింటిదగ్గర బయలుదేరింది మొదలు, రాత్రి పడుకోబోయేంతవరకూ ఆ రోజు ఎదురైన వ్యక్తులూ, వాళ్ళ మాటలూ, ప్రవర్తనా, వాళ్ళ నావిధంగా రూపొందించిన పరిస్థితులూ – వీటిని గురించి ఆలోచించే ఓపికలేక శోషిల్లి పోయిన బుర్రలో, ఏదో గంభీర నిస్తబ్దత వ్యాపించి, చివరి కదే

నిద్రగా పరిణమించిందేమో! లేకుంటే అది నిద్రాదేవత ఆగమనం కోసం ఎదురుతెన్నులు చూడవలసిన రాత్రి మాత్రం కాదు.

ఎలాగైతేనేం, నిద్ర పట్టింది. కొత్త బట్టలు వేసుకొని, వీధిలో బురదనీళ్ళలో పొర్లాడివచ్చిన కుర్రాడిని, మొదట చెడామడా చెంపలు వాయించి 'అయ్యో బిడ్డకేం తెలుస్తుం'దన్న జాలితో చంకకెత్తుకుని లాలించే తల్లికి మల్లే నిద్రాదేవత నన్ను ఒడిలోకి చేరదీసుకుని తీయగా లాలి పాడింది.

ఎంతసేపు నిద్రపోయానో తెలియదు. ఉన్నట్టుండి మేలుకున్నాను. మేలుకోగానే నా కవగతమైన విషయాలు రెండు. అప్పటికి చంద్రు డస్తమించాడు. ప్రక్కన మంచంపైన రాజు లేడు! పైన నెలరాజుతోబాటు, క్రింద రాజుగూడా లేక ఒంటరిగా మిగిలిపోయిన నాకు ఆ చీకటిలో మేడ, దాని పరిసరాల్లో వున్న చెట్లు, గోడలూ ఎన్నెన్ని రూపాలతో కనిపించాయో చెప్పలేను. దైవం, దయ్యం లాంటి అలౌకిక శక్తులు వుండడం గాని, వుండకపోవడం గాని వేరే విషయం. అసలు విషయ మేమిటంటే వాటికన్నా, వాటి భావాభావాలను గురించి మానవుడి బుద్ధికి గోచరించిన కల్పనలే అతడిని ఎక్కువగా బాధిస్తున్నాయి.

ఓ రోజు తెల్లవారింది మొదలు ఎండ పట్టపగ్గాలు లేకుండా కాస్తుంది. సాయంత్రానికి ఎండతగ్గి ఆకసం నీలమేఘాచ్ఛన్నమై పోతుంది. ఐనా ఆక ల్లాడదు. ఉక్కలో ప్రపంచం ఉక్కిరి బిక్కిరై పోతుంది. ఆ తరువాత అర్ధరాత్రి సన్నసన్నగా చినుకులు జారసాగి, చూస్తుండగానే కుంభవర్షం ప్రారంభమై పోతుంది. ఆ రోజు నా మానసాకాశంలో అలాంటి పరిణామాలు కలిగాయి.

మేడపైన గదిలో ఏ భయదమైన ఊహతో గుండెలు కరిగించుకుంటున్నాడో అర్చకుడు మురారి! అతణ్ణి పరిరక్షించడం కోసం ఏవిధమైన కొత్తబోను నిర్మించే ఆలోచనలో వున్నాడో సాంబయ్య! ఇంటిలో వున్న సరుకును, ఒరుల కంటికి తెలియకుండా, బయటికి తరలించటానికి ఏ క్రొత్త పథకాన్ని ఆలోచిస్తున్నదో సుందరమ్మత్త! ఏ ఆనందాన్ని అన్వేషిస్తూ రాజు ఒకానొక రాత్రివేళ మాయమై పోయాడో?

ధగధగా మెరుపులు, పెళపెళా వురుములు, జడివాన, ఝంఝామారుతం – వీటిమధ్య భూనభోంతరాలు ఘూర్ణిల్లిపోతుండగా పిడుగు కూడా పడింది.

అయ్యో రాధా! ఈయిల్లా నీ నిండు జీవితానికి విడిది? పండు వెన్నెల్లా నిన్ను ఆక్రమించుకుంటున్న యౌవన సౌభాగ్యం, మధుర మధురంగా నువ్వు నిర్మించుకుంటున్న ఆనంద సామ్రాజ్యం ఈ తరిగొండ మరుభూముల్లో యింకిపోవని నమ్మకమేమిటి?

* * *

రాజేశ్వరి పిన్ని తరిగొండనుంచి బోలెడు శ్రవణానందకరమైన కబుర్లు మోసుకొచ్చింది. పెండ్లి సంబరాలన్నింటికీ నాందీవాచకంగా ఆ కబుర్లతో యిల్లు యిల్లంతా మారుమ్రోగిపోతోంది. చేష్టలుడిగి, బాబాయి ఎదుట కుర్చీలో బొమ్మలా కూచోడంకన్నా మరేమీ చేయలేకపోయాను. ద్వార బంధానికి ఆనుకుని రాజేశ్వరి పిన్ని చేతులు త్రిప్పుతూ అబ్బాయి గుణగణాల్ని గురించి, అతడి ధనకనక వస్తువాహనాల్ని గురించీ చెప్పుకుపోతోంది.

"బొగ్గుల్లో మాణిక్యం గదండీ! ఎంత ఓర్పు, ఎంత శాంతం! అంత నెమ్మదైన కుర్రాణ్ణి నేను పుట్టిందే చూచి ఎరుగననుకోండి! ఒకరితో 'నువ్వెంత, నేనెంత' అని మట్లాడుతాడా? తెట్టతేరకు 'ఓ' అని విరగబడి నవ్వుతాడా? పెది విప్పడమే బ్రహ్మాండం కదుటండీ! మరొకరూ, మరొకరూ అయితే తనకున్న ఆస్తిపాస్తులకు ఆకాశం కన్నా పొడుగ్గా విర్రవీగిపోరూ! ఏదీ, గర్వం మచ్చుకైనా

కనపడదే! అతడలావుండగా ఆకుర్రాడి తల్లిమాత్రం? సుందరమ్మ అంటే సుందరమ్మే కదండీ! ఆరుగురు బిడ్డల తల్లి గదా. యిప్పుడు వెళ్ళి చూడండి. యింకా పెళ్ళి అయ్యీ కాని అమ్మాయిలా వుంటే సరేననండి! లేకుంటే మీరు నాకే శిక్షవేసినాసరే......"

ఉదయం పదిగంటలకనగా ప్రారంభమైన కబుర్లు! మధ్యాహ్నం పన్నెండు కావస్తోంది. "తలనొప్పిగా వుంది బాబాయ్, వెళ్ళొస్తాను" అంటూ పైకిలేచాను.

నా తలనొప్పికి కారణమేమిటో గ్రహించేస్థితిలో లేడు బాబాయి. వెళ్ళిపోవడానికి అంగీకారం సూచిస్తూ ఆయన "అన్నట్టు నీ అభిప్రాయమేమిటో చెప్పనేలేదే!" అన్నాడు.

ఏదో అడగాలని అడుగుతున్నాడు గాకపోతే, నిజానికి బాబాయికి నా అభిప్రాయంతో అవసరంలేదు. అవసరం వున్నా, వుండకపోయినా నా అభిప్రాయాన్ని ఆయన పరిగణించడని మాత్రం నాకు బాగా తెలుసు. బాబాయి రథం నడిపిస్తున్నాడు. నేనా రథాన్ని ఆపదలుచుకుని చక్రాన్ని గట్టిగా పట్టుకుంటే, అది పరుగడితున్న ఉరవడిలో ఎగిరి ఏడుబారల దూరంలో పడతాను.

మనసు చివుక్కుమంది. "నువ్వు నన్న తరిగొండకు పంపింది పిన్నికి దోవతోడుగా బాబాయ్! నా కర్తవ్యం నేను నిర్వర్తించాను. అంతే. నాకు మరేమీ తెలియదు" అన్నాను.

అప్పటికైనా ఆయన నా అభిప్రాయమేమిటో గ్రహించివుండవలసింది. ఊహు. లాభంలేకపోయింది.

"నువ్వు 'కాసాబియంకా' విరా బాబూ! ఎంత చెబుతే అంత! వెళ్ళిరామ్మా వెళ్ళిరా" అన్నాడు బాబాయి.

హాలుదాటి, వరండాదాటి చరచరా మెట్లు దిగి పోతున్నాను. మెట్లకు చేరువగా, మల్లెపందిరి క్రింద నిల్చుని నాకేసి అర్థరహితంగా చూస్తోంది రాధ.

అక్కడ కాసేపు ఆగి నేను రాధతో మాట్లాడదలచుకోలేదు. బాబాయి అన్న కొండరాతికి తగిలి, ద్విగుణీకృతంగా మళ్ళీ నా వైపుకే పరావర్తనం చెందిన కోపాన్ని అన్నెంపున్నెం ఎరుగని రాధపైన చూపించదలచుకున్న కఠోరహృదయుణ్ణి నేను! నేను క్షమార్హుణ్ణి కాను.

తిరిగి చూడకుండా తోటలో నడిచిపోతూ "ఇంటికి పోతున్నాను రాధా!" అన్నాను.

"నీకు నామీదగూడా కోపంగా వుందా అన్నయ్యా!" అమాయకంగా ప్రశ్నించింది రాధ.

ముందుకు వేసిన అడుగు వెనక్కుతీసేశాను. కృత్రిమమైన కోపతాపాలతో రాధ ఎదుట నిలబడుకోడం కష్టం. ఆమె విశుద్ధ దర్పణం. ఆ దర్పణంలో నా ప్రతిబింబం కనిపించింది. నేరస్థుడికి మల్లే తలవంచుకున్నాను.

"వచ్చినప్పటినుంచీ నిన్ను చూస్తూనే వున్నా నన్నయ్యా! నీ మనసులోవున్న వుద్దేశమేమిటో నాన్నగారికి చెప్పలేవూ? ఏం, కొట్టి కొరతేస్తారేమిటి?"

"..............."

"పోనీ ఈ సంబంధం నీకిష్టమేనా అన్నయ్యా?"

"నా యిష్టాయిష్టా లేపాటివి రాధా? మీ నాన్నగారి సంగతి నీకు తెలియదు గనుకనా! ఆయన పట్టిన కుందేటికి ఎప్పుడూ నాలుగుకాళ్ళు లేవే!"

"పోనీ, నీకెందుకిష్టంలేదో అదైనా చెప్పగూడదా అన్నయ్యా?"

ఏం చెప్పను! ఆ వూళ్ళో చాలామంది కళ్ళు చెడ్డవనీ, దృష్టిదోషం తగిలితే ప్రాణాపాయమనీ చెప్పనా? ఆ యింట్లో ధనపిశాచం తిరుగుతూంటుందని చెప్పనా? ఏవిధంగా చెబుతే రాధకు సూటిగా అర్థమౌతుంది?

"నాకూ యిష్టంలేదని చెబుతాననుకో అన్నయ్యా, ఎందుకని నాన్నగారూ, అమ్మా అడగరూ! వాళ్ళకు నే నేదో జవాబు చెప్పాలి గదా?"

ఆ జవా బేదో నాకే అవగతం కావడం లేదు. ఇక నేను రాధకెలా వివరించను?

నాకింకొక భయం కలిగింది. ఈ వివాహాని కెలాగయినా అంతరాయం కలగాలన్నది నా అంతరాంతరాల్లోని వాంఛే కావచ్చు. కాని ఆ అంతరాయం రాధవల్లనే కలిగితే అందుకు బాధ్యత నానెత్తిమీదనే పడుతుంది. పరాధికారాన్ని పైనవేసుకోడం ప్రమాదకరం. ఆమాత్రం లోకజ్ఞానం చాకివాడి గాడిదకైతే లేకపోయింది. నాకెందుకు లేకపోవాలి?

"పోనివ్వు రాధా! ఎలాగైనా మనం కుర్రావాళ్ళం. మన బాగోగులు మనకంటే పెద్దవాళ్ళకే బాగా తెలుస్తాయి. మనుషుల్లో మంచివాళ్ళున్నట్టే చెడ్డవాళ్ళూ వుంటారు. మళ్ళీ ఆ మంచివాళ్ళల్లో దుర్గుణలేశాలు, చెడ్డవాళ్ళల్లో సుగుణలేశాలు వుండకపోవు. మంచినీ, చెడ్డనూ గిరిగీసి వేరుపరచడం అసాధ్యం. ఆడబిడ్డ అన్న తర్వాత ఎప్పుడో ఒకప్పుడు అత్తగారింటికి వెళ్ళి అక్కడ క్రొత్త పరిస్థితుల్లో యిమడక తప్పదు."

రాధ బిత్తరపోయింది. ఏదో మాట్లాడబోయింది. పెదవులు విడివడ్డాయి. మళ్ళీ ముకుళించుకపోయాయి. రాధ ఆ విచిత్ర మానసిక పరిస్థితినుంచి కోలుకోవడాని కింకా ఒకటి రెండు నిమిషాలు పట్టవచ్చు. ఆ వ్యవధిని సద్వినియోగం చేసుకోకపోతే నేను మరింత సందిగ్ధకరమైన పరిణామాన్ని ఎదుర్కోక తప్పదు. మునిపంటితో పెదవిని కొరుక్కుంటూ, చెమ్మగిల్లిన కళ్ళతో నన్ను దీనంగాచూస్తూ నిలబడివున్న రాధను ఆమె మానాని కామెను వదలి గిరుక్కున వెనుదిరిగి, తిరిగి చూడకుండా రివ్వున ముందుకు వెళ్ళిపోయాను.

వెళ్ళిపోతూ వూరుకున్నానేమిటి? లోలోపలి తిరుగుబాటు ఉపశమించడానికి వీలుగా ఒకటి రెండు సూక్తుల్ని నెమరువేసుకున్నాను. నుదుటి వ్రాతను తప్పించడం ఎవరితరం? ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు?

కదామరి! నేను పరాజితుడినైనా అయివుంటే చేయగలిగిందంతా చేశాము గదా అన్న సంతృప్తి అయినా దక్కివుండేది! నేను పరిస్థితుల్ని ఎదుర్కోలేక పోయిన పలాయితుణ్ణి! పలాయితుడి ఆఖరు శరణ్యం మెట్ట వేదాంతం!

★ ★ ★

ఉద్యోగికి దూరభూమి లేదన్నారు. దూరభూమి మాత్రం ఏమిటి? వాడికి మనసు లేదు. హృదయం లేదు. వాడు మానవుడు కాదు. ఒకానొక సజీవ యంత్రం అని నిర్వచించి వుంటే మరీ బాగుండేది. లేకుంటే రాధ పెళ్ళి యిక నెలరోజుల్లో వుందనగా నాకు రెండువందల మైళ్ళ దూరానికి ట్రాన్స్‌ఫర్ వచ్చి పెళ్ళి సమయంలో ఓవారం రోజులు సెలవు దొరక్కపోతుందా?

నా ఆర్థిక పరిస్థితులు సహకరించినంతలో పెళ్ళి పీటలపైన రాధకు ఓచిన్న కానుక మాత్రం పంపుకోగలిగాను. అది ఓ వెండి కుంకుమ భరిణ. ఒక పలం కుంకమ తీస్తే అందులో సగానికి సగం కూడా భరిణలో పట్టింది కాదు. ఓ చీటీ వ్రాసి నాలుగువైపులా పసుపునీళ్ళు చిలకరించి పార్సెల్లో వుంచాను. అయిదారేళ్ళ మునుపటి సంగతి. ఐతేనేం? ఈ చీటీలోని నాలుగైదు వాక్యాలూ యింకా బాగా జ్ఞాపకం.

చెల్లీ,

నాకు తోబుట్టువులున్నారు. కానీ, వాళ్ళు నాకు బుద్ధి తెలియక ముందే కాపురాలకు

వెళ్ళిపోయారు. అక్క చెల్లెళ్ళని గురించి తలచుకోగానే మొట్టమొదట నాకు జ్ఞప్తికి తగిలేదానివి నువ్వు. ఇంతదూరంనుంచీ నీకీ మాంగల్యచిహ్నం కానుకగా పంపిస్తున్నాను. స్త్రీ కింతకంటే కావలసిందేమీ లేదు."

గంటల తరబడి ఆలోచించి వ్రాయగలిగిన ఈ వాక్యాల్ని ఎన్నిసార్లు చదువుకున్నానో చెప్పలేను. ఇది ఆశీర్వచనమా? కాదే! ఇందులో ఆశీస్సు లీలా మాత్రంగా నైనా ధ్వనించడం లేదే!

శుభమా అని రాధకు పెళ్ళి జరుగబోతూంటే నా కీ లేనిపోని సంశయా లెందుకు? కత్తుల బోనుల్లాంటి సంసారాల్లో ప్రవేశించి తమ నేర్పరితనం వల్లా, మాటకారితనం వల్లా, మీదు మిక్కిలి సహృదయతవల్లా గృహాన్ని స్వర్గసీమగా మార్చుకున్న స్వయంసిద్ధలు లోకంలో ఎందరు లేదు? మా రాధ వాళ్ళల్లో ఒక్కతె యెందుకు కాగూడదు?

మతిని పట్టే గతులుంటాయన్నది ఒక ఆర్యోక్తి. మా రాధ మనసు నవనీతం. ఆమె హృదయం అమృతకలశం. ఆమెకు కష్టా లెందుకు వస్తాయి? రావు. రాకూడదు.

ఓ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు పైన, తొమ్మిదిన్నరకు లోగా కటకలగ్నంలో రాధకు వివాహ ముహూర్తం. గురువారం రాత్రంతా కలతతో, కలవరాలతో గడిచిపోయింది. అయిదు గంటలకే పడకమీదనుంచి లేచి కూర్చున్నాను. ఈపాటికి నలుగులు జరుగుతుంటాయి. ఇప్పుడు కంకణధారణ జరుగుతూంటుంది. ఈ క్షణంలో కాశీ యాత్రకు బయలుదేరి వుంటారు. గంట ఎనిమిది కావస్తోంది. పడకపైన కూర్చుని వుంటే ముళ్ళపైన కూర్చున్నట్టుంది. లేచి చరచరా వీధిలోకి వచ్చాను. వీధి మొగసాల రామన్న కోవెల ధ్వజస్తంభంపైని చిరుగంటలు ఘల్లుఘల్లు మంటున్నాయి. నిదానంగా నడిస్తే ముహూర్తం దాటిపోతుందేమో! పరుగెత్తాను. తాంబూలం, పళ్ళు, టెంకాయ పళ్ళెరంలో వుంచి "రాధ పేరిట అర్చన జరిపించండి" అన్నాను. పూజారికి నేను అపరిచితుణ్ణి! ఆడపేరు చెబుతున్నందుకేమో అతడు తెల్లబోతూ "ఎవరూ" అన్నాడు. "ఆమె పేరు రాధ స్వామీ! మీకు తెలియక పోవచ్చు. కాని ఎవరికి తెలియాలో వాళ్ళకు తెలిస్తే చాలు. మీరు వేగం అర్చన జరిపించండి" అన్నాను.

అపనిందకు గుర్రై, భర్తకూ, బంధువులకూ దూరమై, అడవులపాలైన సీతమ్మగూడా పళ్ళెరంలోని తాంబూలాన్ని మందహాసంతో స్వీకరించింది!

రోజులు దొరలిపోయాయి. మూడు-నాలుగు-ఐదు-ఆరు నెలలు గడిచిపోయాయి. చివరకు రాధ దగ్గరినుంచి ఓ వుత్తరం వచ్చింది.

"అన్నయ్యా! ఇదేం ఊరు? వీళ్ళేం మనుషులు? ఇక్కడ నేనెలా బ్రతకను?" ప్రశ్నలతో ప్రారంభమైంది ఉత్తరం. "అవన్నీ అలా వుండగా మీ బావమరిది సంగతేమిటి? ఈయన మాట్లాడరు. నవ్వరు. కాఫీ పైకి తీసుకెళ్తే నా కేసి, కాఫీ కేసి భయం భయంగా చూచే ఈయన్ని నే నెలా అర్థం చేసుకోను?...."

ఈకాఫీకి సంబంధించిన గొడవ రాధవ్రాసిన రెండో ఉత్తరంలో మరీ విపరీతంగా కనిపించింది. "ఓ రోజేం జరిగిందో తెలుసా? కాఫీలో డికాక్షన్ ఎక్కువై, చక్కెర తక్కువైంది. చేదుగా వుందేమో ఆయన రుచి చూచి గ్లాసు నలాగే టేబిలుపైన వుంచేశారు. ఆ తరువాత జరిగిన విచిత్రాన్ని గురించి ఏమని చెప్పను! ఆయనా, సాంబయ్యా ఆ మిగిలిన కాఫీని ఒక పిల్లికిపోసి, గది తలుపులు గడియవేసుకుని, ఆ పిల్లి చచ్చిపోలేదేమా అని కాచుకుని కూచున్నారు.

"ఈ యింట్లో అన్నీ విడ్డూరాలే! ఆయన భోజనానికి క్రిందికి రారు. పైకి తీసుకెళ్తే అన్ని పదార్థాలనూ మొదట సాంబయ్యే రుచి చూడాలి. ఎప్పుడో అన్నంపైకి ధ్యాస మళ్ళినప్పుడు ఆయన

నాలుగు మెతుకులు కొరికి లేచిపోతుంటారు.

"అందుకని నేను పైకి వెళ్ళడం మానేస్తే అత్తగారూరుకోవడం లేదు. ఆమెగారి బేరసారాలకు నేను ఆటంకమేమో! పైకి వెళ్ళి కాసేపు నే నాయన దగ్గర కూచోవాలనుకుంటే, అది సాంబయ్యకిష్టం లేదు. ఆ ముసలాడు అరక్షణం ఆయన్ను వదిలి పెట్టడు. ఇతే నేనింక ఎక్కడకి వెళ్ళిపోను?

"వచ్చి తీసుకెళ్ళి పొమ్మని నాన్నగారికి ఉత్తరం వ్రాశాను. ఆయనెప్పు డొస్తారో తెలియదు. అందాకా ఈ మనుషులతో ఎలా వేగగలనో తెలియదు. అన్నయ్యా! నాకేమీ తెలియదు. ఏం చేశానని నాకీ శిక్ష?"

మూడో వుత్తరంలో చివరిభాగం చదివితేగాని రాధకు తోడి మానవులపట్ల ఎంతటి ఏహ్యాభావం కలిగిందో అర్థం కాదు.

"నాన్నగారు రాలేదు. కనీసం అమ్మయినా రాలేదు. ఎవరూ రారు. ఎవరికి ఉత్తరాలు వ్రాసిమాత్రం ఏం లాభం? ఆర్చేవా ళ్ళెవరు? తీర్చేవా ళ్ళెవరు? సాంబయ్య చెబుతున్నట్టు లోకులంతా క్రూరులు, దుర్మార్గులు, మోసగాళ్ళు. పోనీలే అన్నయ్యా? ఏది ఎలా జరగాలని వుందో అలా జరుగుతుంది."

అంతే! రాధ దగ్గిర నుంచి నాకు నాలుగో ఉత్తరం రాలేదు. దానికిబదులు ఆరు నెలల తర్వాత మందులూ, యింజక్షన్లూ తీసుకుని తక్షణం తరిగొండకు బయల్దేరి రమ్మంటూ బాబాయి దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది.

మందులూ, యింజక్షన్లూ ఎవరికి? రాధకేమో ననుకున్నాను. కాదని తరిగొండకు వెళ్ళిన తర్వాత తెలిసింది. మురారి మంచానికి మేనప్పగించి మూడు నెలలయిందన్నారు. గ్రుక్క తిప్పుకోలేని దగ్గుతో అతడు సతమతమై పోతున్నాడు. ముఖం పాలిపోయింది. కాళ్ళూ చేతులూ ఈనపుల్లలై పోయాయి. పెదవులు నల్లబడి, బీటలు పడ్డాయి. బంధువు లందరూ మంచంచుట్టూ మూగివున్నారు. వాళ్ళల్లో బాబాయి వున్నాడు. రాజేశ్వరి పిన్ని వుంది. సుందరమ్మత్త, నరసింహం మామయ్య, రాజు, సాంబయ్య అందరూ వున్నారు. అక్కడ లేనిది రాధ మాత్రమే!

"రాధ ఎక్కడ బాబాయ్?" కంగారుగా ప్రశ్నించాను.

బాబాయి తల పైకెత్తి నావైపుచూచాడు. ఆయన కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

మెట్లపైన దూకుతూ క్రిందికి దిగాను. కాలుగాలిన పిల్లిలా యిల్లంతా కలయతిరిగాను. ఎదురైన వాళ్ళనందర్నీ 'రాధ ఎక్కడ?' అని అడిగాను. ఎవరో పుణ్యాత్ముడు దయదలచి నన్ను రాధకోసం ప్రత్యేకించబడిన గది దగ్గరకు తీసుకెళ్ళాడు. మలిన వసనాలతో, మాసిన తలతో మూర్తీభవించిన అంతులేని ఆవేదనలాంటి రాధ కనిపించింది - గదిలో ఓ మూలగా, గోడకంటుకుపోయి.

గుండెలవిసిపోతుండగా "యిదంతా యేమిటి రాధా?" అన్నాను.

"మరులు మందు పెట్టానట అన్నయ్యా! మొగుణ్ణి స్వాధీనం చేసుకోడం కోసం" అంది నెమ్మదిగా రాధ.

"నువ్వా! మరులుమందు పెట్టావా? మందులూ మాకులూ నీకేం తెలుస్తాయి రాధా?"

"నీకు తెలియదులే అన్నయ్యా! నేను మాయలాడిని. కిరాతకురాల్ని. కొంపలార్పేయడం నాకు వెన్నతోబెట్టిన విద్య. నీకు సందేహంగా వుంటే అలా వీధిలోకి వెళ్ళి అడుగు. ఎవరైనా చెబుతారు."

ఇవే రాధ జీవితంలో ఆమె నోటిగుండా వచ్చిన చివరి వాక్యాలు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు మేడపైన ఒకసారి అందరూ గొల్లుమన్నారు. నేనూ, రాజేశ్వరి పిన్నీ పైకి వెళ్ళాము. మురారి పరిస్థితి నిజంగానే అయోమయంగా వుంది. పట్నం నుంచి వచ్చిన డాక్టరు సూదులు వేసినవాడు వేసినట్టే వున్నాడు. మురారి మూసిన కళ్ళు తెరవడం లేదు. డాక్టరు శతవిధాలా ప్రయత్నించాడు. చివరకు పెదవి విరచి "ఇక చేయగలిగిందేమీ లే"దని చేతులు కడుక్కొని బయటకు వెళ్ళిపోయాడు.

కాని మురారి చనిపోలేదు. అతడికోసం వచ్చిన మృత్యుదేవత మార్గమధ్యంలో మరొకరు దొరకడంతో తృప్తిపడి వెళ్ళిపోయింది. డాక్టరు నరాల బలహీనత అన్నాడు. గుండె ఆగిపోయిందన్నాడు. ఏమైతే ఎవడికి కావాలి? ఇంక రాధ లేదు. నరకంలోనుంచి ఒక జీవాత్మకు విముక్తి లభించింది. ఇంక రాధ మన కళ్ళకు కనిపించదు, ఇకమీదట రాధ కేవలం ఒక స్మృతి.

చల్లటి సాయంకాలాల్లో చెట్టాపట్టాలు వేసుకుని సరాగాలు పోతూ పేవ్‌మెంటుపైన సాగిపోయే దంపతులు ఎదురౌతారు. రైలు ప్రయాణాల్లో, సినిమా థియేటర్లలో, సముద్ర తీరాల్లో ఒకరి ప్రక్కన ఒకరు కూచుని పరవశించిపోయే భార్యాభర్తలు ప్రత్యక్షమౌతారు. మండుటెండలో రోడ్డు రోలరు లాగి శీతల తరుచ్ఛాయలో ఒకేరాతిని తలగడగా వుంచుకొని సేదదీరుతున్న ఆలుమగలు కన్పిస్తారు. దాంపత్య జీవితం ప్రసాదించే అనుపమానందాన్ని జుబ్బనజూరలాడే ఈ అసంఖ్యాక మానినీ సమూహంలో మా రాధ ఒక్కతె కాదు.

* * *

రాధ చనిపోయిన తర్వాత ఇది నాలుగో ఏడు. ఈ నాలుగేళ్ళలో మురారి ఏమయ్యాడో నేను తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. పెళ్ళిళ్ళలో, పేరంటాల్లో అతడిని గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా దూరంగా వెళ్ళిపోయాను. కాని ఇన్ని రోజుల తర్వాత మళ్ళీ మురారిని గురించి వినక తప్పిందిగాదు. వినడంతో ఏమైంది? మరి కొంతసేపటికి అతణ్ణి కలుసుకోబోతున్నాను.

హోట లజంతా' మెట్లెక్కుతుండగా గంట అయిదు కొట్టింది. రెండో అంతస్తులో ఇరవై నాలుగో నంబరు గది నా గమ్యస్థానం. గది ముందర సాంబయ్య కనిపించాడు. 'బాబుగారు స్నానానికి వెళ్ళారు. లోపల కూర్చోండి. వస్తారు' అన్నాడు. ప్రొద్దు గ్రుంకబోతుండగా యిప్పుడేం స్నానం? బహుశా అవభృథ స్నానం కావచ్చు. మురారి ఏదో పుస్తకం వ్రాస్తున్నానన్నాడు. అది అయిదు గంటల కల్లా పూర్తి కావచ్చునని వ్రాశాడు. నిజానికి పుస్తకం వ్రాయడానికన్నా యజ్ఞమేముంది?.....ఈ ఆలోచనలతో గదిలో గాజు కిటికీకి దగ్గర నిల్చున్నాను. కిటికీ తెరిస్తే తోటలోనుంచి చల్లగా గాలి లోపలికి వస్తుంది. కానీ మూసివున్న కిటికిని నేనెందుకు తెరవాలి? కిటికీకి చేరువగా ఓ కుర్చీలో కూర్చున్నాను. ఆ గది అంత చిన్నదీకాదు, పెద్దదీకాదు. ఓవైపు ట్రంకూ, పరుపూ, వాటి కెదురుగా ఒక చిన్న మంచం, మధ్యగా ఓ రౌండ్ టేబిల్, దానిచుట్టూ నాలుగైదు కుర్చీలు - ఈ ఫర్నీచరు గాదు నన్నాకర్షించింది! వీటన్నింటిపైనా చెల్లాచెదురుగా పడివున్న పుస్తకాలు. ఆ గది పుస్తకాల దుకాణం కాదు. కాదనుకోడానికి కారణం ఒక్కటే! ఆ పుస్తకాలొక పద్ధతిలో లేవు. వాటిలో ముప్పాతిక మువ్వీసం యింగ్లీషు పుస్తకాలు. అవి కథలో, కావ్యాలో, నాటకాలో ఆ విషయం అప్రస్తుతం. మున్ముందు చూపరికి కొట్టవచ్చినట్టు కనిపించేవి ఆ ముఖచిత్రాలు! ఒకచోట నగ్నసుందరి. మరొకచోట గాఢాలింగనం. చేతులు పైకెత్తి నిల్చున్న ఓ దృఢకాయుడి గుండెలపైకి రివాల్వరు గురిపెడుతున్న యువతి. ప్రణయంలో తల మునకలై తన్మయావస్థలోవున్న ప్రియురాలి కంఠాన్ని రెండు చేతుల్తో నొక్కివేస్తున్న విచిత్ర ప్రేమికుడు! ఓహ్! ఒకటా, రెండా? ఎన్నెన్ని విచిత్ర దృశ్యాలు! మళ్ళీ బొమ్మలన్నీ

ఎంతో అందంగా వున్నాయి. బొమ్మల్లో చిత్రించబడ్డ వాళ్ళల్లో అనేకులు స్ఫురద్రూపులు. పాపం, వీళ్ళు హాయిగా కాపురాలు చేసుకోక ఈ ఘాతుక కృత్యాల కెందుకు పూనుకుంటున్నారు? వీళ్ళు పిచ్చివాళ్ళయి వుండరు. అలా ప్రవర్తించడానికి వెనుక ఏవో కారణాలుంటాయి. అవేమిటో ఆ పుస్తకాలు తీరా మారా చదివితేగాని బోధపడదేమో! ఆఫీసు గోడవల్లో తనమునకలై, దినపత్రిక చదవడానికే నోచుకోని నాలాటి ఉద్యోగికి యిన్ని పుస్తకాలు చదివే తీరిక ఎప్పుడు లభిస్తుంది?

మెల్లగా గది తలుపులు తెరచుకున్నాయి. మొలకొక తువ్వాలు మాత్రం చుట్టుకున్న మురారి లోపలికి వచ్చాడు.

శారీరకంగా మురారిలో మార్పులేవీలేవు. ఆరేళ్ళక్రితం నేను మొదటిసారి చూచినప్పు డెలావున్నాడో, యిప్పుడూ అలాగేవున్నాడు. లేదంటే ఆ కళ్ళు మరీ తేజోవిహీనంగా రూపొంది, చూపులు మందకొడిగా వున్నాయి. నన్ను చూడగానే పలకరించదలచుకున్నాడేమో, పెదవుల్లో కొంచెం కదలిక కనిపించింది. కాని అంతలో ఆ ప్రయత్నం విరమించి నిశ్చలంగా నిల్చున్నాడు. సాంబయ్య పెట్టెతెరిచి దుస్తులు పైకితీశాడు. మడతలు విప్పి మురారికి తగిలించాడు. ఆ తరువాత మంచంపైన పడివున్న పుస్తకాన్ని తీసి అతడిచేతి కందించాడు.

మురారి వ్రాసి ముగించిన పుస్తకానికి ఉపోద్ఘాతాలు లేవు; ఆముఖాలు, అభిప్రాయాలూ లేవు. అట్ట తెరవగానే ఊపిరి త్రిప్పుకోడానికి తెరపి లేకుండా కథ ప్రారంభమైపోయింది. కాళరాత్రి, కారుచీకటి. 'రాజభవన్' ప్రాంగణంలో కుక్క అరుపులు ఆ చీకటిని, నిశ్శబ్దాన్ని చీల్చుకుని వెలువడుతున్నాయి. సరిగ్గా ఆవేళప్పుడు పోలీసు స్టేషనులో టెలిఫోను గణ గణ మ్రోగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధరం ద్విచక్రశకటారూఢుడై రాజభవన్ సమీపించేసరికి కుక్క రక్తప్రవాహంలో తన్నుకుంటోంది. మేడలో దీపాలు వెలగడంలేదు. తలుపులు బారగిల తెరచివున్నాయి. మెయిన్ స్విచ్ చెడిపోయింది. శ్రీధరం కరదీపిక వెలిగించాడు. గోడపైన నెత్తుటి మరకలు, హాల్లో విరిగి పోయిన పూలకుండీలు, పగిలిపోయిన పటాలు .... కాలం బరువుగా గడచిపోతోంది. కిటికీకి ఆవల గాజు తలుపులపైన నీలినీడలు దట్టంగా అలముకుంటున్నాయి. మురారికథ శరవేగంతో పరుగిడుతోంది. చనిపోయింది ఓ యిరవయ్యేళ్ళ అమ్మాయి. అనుమానితులు అసంఖ్యాకులు. చిత్ర మేమిటంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులు గూడా ఆ అనుమానితుల్లో వున్నారు. చనిపోయిన యువతి ఇన్‌స్పెక్టరు శ్రీధరం ప్రియురాలు. అందువల్ల డిటెక్టివ్ బెనర్జీ శ్రీధరాన్ని సైతం అనుమానిస్తాడు! టెలిఫోన్ మోగితే భయం! తపాలావాడు 'పోస్ట్' అని కేక వేస్తే భయం! ఇందరిలో నిశ్చింతగా తల పైకెత్తుకుని నడవగలిగిన మనిషి ఒక్కడూ లేడు! పాదలమాటున ముసుగు మనిషి వున్నాడేమో! కారుకు వెనుకవైపున అరలో శవం వుందేమో! ఇవన్నీ భయంలో పుట్టిన పాత్రలు. అనుమానాన్ని ఆహారంగా భుజించి క్షణ క్షణ ప్రవర్ధమానమౌతున్న పాత్రలు. వెలుగునూ, వెన్నెలనూ విడిచి పెట్టి చీకటిలోకి పారిపోతున్న పాత్రలు. ఆఖరుకు ఈ పాత్ర లేమౌతాయి? వాటిసంగతలా వుంచండి - ఈ మురారి ఏమౌతాడు!